E-mail:prajamantalu@gmail.com
www.prajamantalu.com

# ప్రజా మంటలు

సంపుటి:4 సంచిక:183
పేజీలు - 8 వెల- రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

గురువారం 29, ఫిబ్రవరి-2024

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri


## పశుసంవర్ధకశాఖలో భారీ కుంభకోణం

### ఏసిబి అధికారుల దర్యాప్తు

హైదరాబాద్,ఫిబ్రవరి28 : పశుసంవర్ధకశాఖలో భారీ కుంభకోణం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈమేరకు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసేందుకు సిద్ధమ య్యారు.ఆవుల కొనుగోలు నిమిత్తం ప్రభుత్వ నిధుల నుండి రూ. 8.5 కోట్లను గత ప్రభుత్వం విడుదల చేసింది.ఆవులు అమ్మిన వ్యాపారులకు మాత్రం4కోట్ల మాత్రమే అకౌంట్లో జమయ్యాయని అధికారులు గుర్తించారు. మిగిలిన 4.5 కోట్లు బినామీ అకౌంట్స్ కి ముఠా సభ్యులు మళ్ళించారని సమాచారం. దీనిపై రైతులు నిలదీయడంతో కోటిన్నర రూపాయలను ముఠా సభ్యులు తిరిగి ఇచ్చినట్లు తెలియవచ్చింది. తమకు ఇంకా మూడు కోట్ల రూపాయలు పశుసంవర్ధకశాఖ నుండి రావాలంటూ ఏసీబీకి పుంగనూరు ఆవుల రైతులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## తెలంగాణ వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



2లో..

- ఆదిలాబాద్‌లో ప్రమాదానికి గురైన విద్యార్థి
- నిముషం ఆలస్యం..కొందరికి నిరాకరణ

## కేంద్రానికి లొంగిపోయిన జగన్



- రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు
- చంద్రబాబును తొంగదీసుకునే యత్నాలు
- దర్యాప్తు సంస్థలతో కేంద్రం దాడులు దారుణం
- సిపిఐ నేత నారాయణ ఘాటు విమర్శలు

3లో..

# ఇస్రో లాంచ్‌ప్యాడ్‌కు మోడీ శంకుస్థాపన




- శాస్త్రవేత్తలను డిఎంకె గౌరవించడం లేదని ఆగ్రహం

చెన్నై,ఫిబ్రవరి28 : తమిళనాడులోని తూత్కుకుడి జిల్లా కులశేఖర పట్టణంలో ఇస్రో లాంచ్ ప్యాడ్ కు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారంనాడు శంకుస్థాపన చేశారు. అయితే, అనూహ్యంగా ఈ శంకుస్థాపన కార్యక్రమం కోసం డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన 'ఇస్రో' యాడ్ తీవ్ర దుమారం రేపింది. ప్రధాని మోదీ సహా, బీజేపీ నేతలు డీఎంకేను తప్పుపట్టగా, తూత్తుకుడి ఎంపీ కనిమొళి సొంత పార్టీని సమర్ధించారు. ఇస్రో సెకెండ్ ల్యాంచ్ ప్యాడ్ శంకుస్థాపన సందర్భంగా తమిళనాడు పశు సంవర్ధక శాఖ మంత్రి అనితా రాధాకృష్ణన్ స్థానిక పత్రికలకు ప్రకటన ఇచ్చారు. ఇందులో ప్రధానమంత్రి మోదీ, తమిళనాడు సీఎం స్టాలిన్, ఇతర డీఎంకే నేతలతో పాటు చైనా జాతీయ జెండాతో ఉన్న రాకెట్ కనిపించడంతో దుమారం రేగింది. దీనిపై బీజేపీ చీఫ్ అన్నామలై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే నిబద్ధత, దేశ సౌరభౌమత్యం విస్మరణను ఇది తలపిస్తోందని, గత తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు డీఎంకే ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిగతా 3లో..



## ఔటర్ రింగ్ రోడ్డు టోల్ టెండర్లలో అవకతవకలు

- విచారణకు ఆదేశించిన సిఎం రేవంత్
- రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్‌లను కలిపేలా రేడియల్ రోడ్స్
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌పై సిఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్,ఫిబ్రవరి28 : ఔటర్ రింగ్ రోడ్డు టోల్ టెండర్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో ఎక్కువ ఆలస్యం చేయకుండా.. వీలైనంత వెంటనే పూర్తి వివరాలు సమర్పించాలని హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలికి సూచించారు. సీబీఐ లేదా అదే స్థాయి దర్యాప్తు సంస్థకు రిపోర్ట్ ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని యోచిస్తున్నట్టు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్‌పై హెచ్ఎండీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వైపు ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. రీజనల్ రింగ్ రోడ్డు పరిధి లోపల ఉన్న ప్రాంతాన్ని హెచ్ఎండిఎ పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. వీటికి కు అనుసంధానంగా.. రేడియల్ రోడ్స్ అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం మిగతా 3లో..

## హెచ్ఎండీఏలో విజిలెన్స్ సోదాలు




- హైరైజ్ అనుమతులపై కీలక ఫైళ్లు స్వాధీనం
- ఫైళ్లను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

హైదరాబాద్,ఫిబ్రవరి28 : హెచ్ఎండీఏలో విజిలెన్స్ సోదాలు కలకలం రేపుతున్నాయి. హెచ్ఎండీఏ కార్యాలయంలో బుధవారం ఉదయం నుంచి విజిలెన్స్ సోదాలు కొనసాగాయి. 50 మంది స్పెషల్ టీమ్‌తో సోదాలు చేపట్టారు. గత ప్రభుత్వంలో అనుమతి ఇచ్చిన ఫైల్స్‌ను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మైత్రీవనం నాలుగో అంతస్తులో ఉన్న అన్ని ఫైల్స్‌ను విజిలెన్స్ సీజ్ చేసింది. అంతేకాకుండా.. స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని ఏడో అంతస్తులో కూడా తనిఖీలు చేస్తున్నారు. అరెస్ట్ వారెంట్‌తో వెళ్లిన విజిలెన్స్ నిఘా టీం.. హెచ్ఎండీఏ ఇద్దరు డైరెక్టర్లు గతంలో అనుమతించిన ఫైల్స్‌పై ఆరా తీశారు. ఆన్‌లైన్ డేటా నుంచి చెరువులు మాయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నాలుగు రోజుల క్రితమే దాడులు జరుగుతాయని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులను ముందే మిగతా 3లో..

# రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ హవా..

- క్రాస్ ఓటింగ్‌తో ఖంగుతిన్న ప్రతిపక్షాలు
- 10 స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ



న్యూఢిల్లీ,ఫిబ్రవరి28 : దేశవ్యాప్తంగా 15 స్థానాలకు మంగళవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ 10 స్థానాలను కైవసం చేసుకుంది. మిగిలిన ఐదింటిలో కాంగ్రెస్‌కు 3, సమాజ్ వాదిపార్టీకి 2 స్థానాలు లభించాయి. ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగి ఫలితాలు తారుమారు అయ్యాయి. ముఖ్యంగా హిమాచల్‌ప్రదేశ్ కౌంటింగ్ ప్రక్రియలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఇక్కడి ఫలితం టై కావడంతో ఎన్నికల అధికారులు డ్రా తీశారు. ఈ డ్రాలో బీజేపీ అభ్యర్థిని విజయం వరించడంతో కాంగ్రెస్ ఖంగుతింది. ఈ ఓటమి ఆపార్టీ అధికార పీఠానికి ఎసరు పెట్టే అవకాశం లేకపోలేదు. ఇక యూపీలో 10 స్థానాలకుగాను 8 స్థానాలను బీజేపీ కైవసం చేసుకోగా సమాజ్ వాదీ పార్టీ 2 స్థానాలలో విజయం సాధించింది. ఇక్కడ కూడా క్రాస్ ఓటింగ్ జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. కర్ణాటక మినహా, యూపీ, హిమాచల్‌ప్రదేశ్‌లలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ పెద్దెత్తున జరిగింది. బీజేపీ ఎత్తుగడల ముందు మిగతా 3లో..

## మేడిగడ్డకు కెసిఆర్ కూడా వెళ్లాలి

- కుంగిన తీరుపై ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచన

వివరాలు 3లో..



## మోడీ తెలంగాణ పర్యటన ఖరారు

హైదరాబాద్,ఫిబ్రవరి28 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారు అయ్యింది. రెండ్రోజుల పాటు ఇక్కడ పర్యటిస్తారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారు అయ్యింది. మార్చి 4, 5వ తేదీల్లో ప్రధాని మోదీ రెండు రోజులపాటు రాష్ట్రంలో పర్య టించనున్నారు. 4వ తేదీన మోదీ ప్రత్యేక విమానంలో హైదరాబాద్ కు రానున్నారు. అక్కడి నుంచి నేరుగా అదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తారు. అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాప చేయనున్నారు.

## ప్రజానాడి



# జగిత్యాల మున్సిపాలిటీలో బిఆర్ఎస్‌పార్టీకి ఎదురు దెబ్బ

- ఫలితం ఇవ్వని గోవా క్యాంపు విప్‌ను ధిక్కరించిన 12 మంది బిఆర్ఎస్ కౌన్సిలర్లు
- చక్రం తిప్పిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
- జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ గా అడువాల జ్యోతి



జగిత్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు): జగిత్యాల మున్సిపాలిటీలో బిఆర్ఎస్‌పార్టీ కి ఎదురు దెబ్బ తగిలింది పార్టీ నిర్ణయించిన అభ్యర్థి సమీన్ల వాణీ శ్రీనివాస్ కు వ్యతిరేకంగా 12 మంది టిఆర్ఎస్ కౌన్సిలర్లు ఓటు వేయడంతో తిరుగుబాటు అభ్యర్థి అడువార జ్యోతి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికయింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, బిజెపి పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు, టిఆర్ఎస్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థికి మద్దతు ప్రకటించారు.ఈ తిరుగుబాటు వెనక కాంగ్రెస్ ఎమ్మెల్సీ స్థానిక నాయుడుకు జీవన్ రెడ్డి చక్రం తిప్పినట్టు తెలుస్తుంది. అడువాల జ్యోతి గతంలో కాంగ్రెస్ పార్టీ నుండి టిఆర్ఎస్ లో చేరారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన అడువాల జ్యోతి మళ్లీ అదే కాంగ్రెస్ సహకారంతో మున్సిపల్ చైర్మన్‌గా మిగతా 2లో..

# కాంగ్రెస్ ఖాతాలో జగిత్యాల మున్సిపాలిటీ

## ఒక్కోటు మెజార్టీతో చైర్‌పర్సన్‌గా జ్యోతి ఎన్నిక

## ఎమ్మెల్యే సంజయ్‌కు షాక్ ఇచ్చిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు



జగిత్యాల,ఫిబ్రవరి28 : జగిత్యాల మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలో పడింది. కాంగ్రెస్ మున్సి పల్ చైర్‌పర్సన్‌గా జ్యోతి ఎన్నికయ్యారు. కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ కౌన్సిలర్లు మద్దతు ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు ఆ పార్టీ కౌన్సిలర్లు బిగ్ షాక్ ఇచ్చారు. సంజయ్ ఆదేశాలను ధిక్కరించి మరీ బీఆర్ఎస్ కౌన్సిలర్లు వేరే వాళ్లకు జైకొట్టారు. బీఆర్ఎస్ ప్రతిపాదించిన వాణికి కాకుండా.. జ్యోతికి మద్దతు తెలిపారు కౌన్సిలర్లు. కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం జ్యోతికే సపోర్ట్ చేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రతిపాదించిన వాణి ఓటమి పాలయ్యారు. ఇక్కడ ఇంకో ట్విస్ట్ ఏంటంటే.. సంఖ్యా బలం ఉండి కూడా బీఆర్ఎస్ చైర్మన్‌ను పదవిని కోల్పోయింది . దీంతో జగిత్యాల కొత్త మున్సిపల్ చైర్మన్‌గా అడువాల జ్యోతి ఎన్నికయ్యారు. వాణికి 23 ఓట్లు పడగా.. జ్యోతికి 24 మంది కౌన్సిలర్లు మద్ధతు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్ల సపోర్ట్‌తో జగిత్యాల మున్సిపల్ చైర్మన్‌గా జ్యోతి ఎన్నిక య్యారు. జగిత్యాల మున్సిపల్‌లో మొత్తం 48 మంది కౌన్సిలర్లు ఉన్నారు. బుధవారం నిర్వహి ంచిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు 35 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరయ్యారు. ఐదుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ముగ్గురు బీజేపీ కౌన్సిలర్లు, ఒక ఎంఐఎం కౌన్సిలర్ హాజరయ్యారు. అయితే ఒక బీఆర్ఎస్ కౌన్సిలర్ అందుబాటులో లేకపోవడంతో గైర్హాజరుగా ప్రకటించారు.

# మూసీని కబ్జా చేస్తున్నా పట్టించుకోరా

## భూకబ్జాలు చేసి 111 జీవో ఎత్తేశారు: కిషన్ రెడ్డి



హైదరాబాద్,ఫిబ్రవరి28 : హైదరాబాద్ లోని మూసి పరివాహక ప్రాంత భూములు కబ్జాలకు గురవు తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆ భూములను పేదప్రజలకు అద్దెకు ఇవ్వడం లేదా అమ్మడం జరుగు తుందని దీంతో వారు తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారని చెప్పారు. అంబర్ పేట నియోజకవర్గంలో కిషన్ రెడ్డి పర్యటించారు. ఆయన మాట్లా డుతూ గత ప్రభుత్వం ప్రక్షాళన పేరుతో ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి డబ్బులు వృథా చేసిందని ఫైర్ అయ్యారు. వందల ఎకరాలను కబ్జా చేసి 111 జీఓ ను ఎత్తివేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం భూములను ఆక్రమించి అగాడాలకు పాల్పడిందని కిషన్ రెడ్డి ఆరోపిం చారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీ నాయకులతో కలిసి లండన్ వెళ్తుందని విమర్శించారు. అక్కడి నదిని చూపిం చి దానిలాగా ప్రక్షాళన చేస్తామని చెప్తున్నారని అసలు నగరంలో మూసీ పరివాహక ప్రాంతాలను ఆక్రమించిందే మజిలీస్ పార్టీ అని ఆరోపించారు. హైదరాబాద్ ను రక్షించాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి చెప్పారు. ఇందుకు ప్రజలంతా ముందుకు రావాలన్నారు.

# కరీంనగర్‌కు ఏం చేశావో చెప్పు బండి

## మరోమారు నిలదీసిన మంత్రి పొన్నం





వేములవాడ,ఫిబ్రవరి28 : రాముడి జన్మ ఎక్కడాఅని అడిగే మూర్ఖుడు ఉన్నాడా? రాముని పేరు చెప్పి ఓట్లు ఆడుకుంటున్నారు. మార్కెటింగ్ చేసుకుంటున్నారు. రాముడి గురించి తప్పు గా మాట్లాడితే సజీవ దహనానికి సిద్ధమని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ అన్నారు. బుధవారం వేములవాడ మండలం నాంపల్లి శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బండి సంజయ్ అమ్మకు పుట్టినవా అని అన లేదు అంటున్నాడు. అమ్మను రాజకీయాల్లోకి తీసుకువచ్చింది ఎవరని ప్రశ్నించారు. హుస్నాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద బతికున్న మా అమ్మను పట్టుకొని తప్పుగా మాట్లాడావు. మా అమ్మ ఆత్మ ఘోషిస్తుంది వెధవ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో కరీంనగర్ ఎంపీగా చేసిన అభివృద్ధిపై చర్చకు రమ్మంటే రావడం లేదన్నారు. హిందువుని చెప్పు కుంటున్న బండి సంజయ్ వేములవాడ దేవస్థానానికి ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. దండం పెట్టి అడుగుతున్న.. ఈ మూర్ఖుడు ఐదేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజవర్గానికి ఏం చేశాడో నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# కుక్కల దాడిలో వంద గొర్రెలు మృతి

## అబోదిబో మంటున్న గొర్రెల కాపరి

సూర్యాపేట,ఫిబ్రవరి28 : వేట కుక్కల దాడిలో సుమారు 100 గొర్రెలు మృతి చెందాయి. ఈ విషాదకర సంఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం తూర్పు గూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాయం రవీందర్ గొర్రెలను పెంచుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఎప్పటిలాగే గొర్రెలను తన వ్యవసాయ క్షేత్రంలో తోలి ఇంటికి వెళ్లాడు. తెల్లావారి వచ్చి చూసే సరికి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.15 లక్షల పైగా నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనని ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

# టెన్త్ పరీక్షకు పక్కాగా ప్రణాళిక

## ముందస్తు ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ

ఆదిలాబాద్,ఫిబ్రవరి28 : జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేలా ప్రణాళిక సిద్దం చేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించాలని, కేంద్రాల్లో విద్యార్థులకనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్సెస్సీ పరీక్షలకు జిల్లాలో అవసరమైన పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. పరీక్ష పేపర్లను భద్ర పర్చడానికి పోలీసు స్టేషన్‌లో ట్రంక్ బాక్సులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్ష జరిగే రోజు ఉదయం 8 గంటలకు సీఎస్‌లు, డీఓ లు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఉండి సెట్ ద్వారా తెలియజేసిన ఆదేశాలు పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. అధికారులు పరీక్ష కేంద్రాలను ముందుగా సందర్శించి స్టేషనరీ, ఫర్నీచర్, తాగునీరు, శానిటేషన్ సౌకర్యాలను పరిశీలించి, తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు దగ్గరలోని పోలీస్ స్టేషన్ అధికారులు, తాసిల్దార్లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారులకు సమాచారం ఇచ్చి వారినుంచి సహాయం తీసుకోవాలని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో సీఎస్‌లు, డీవోలు విద్యార్థుల సంఖ్య అధారంగా గదులు ఏర్పాటు చేసు కోవాలని, సరిపడా ఇన్విజిలెటర్లను నియమించుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు వారు బోధించే సబ్జెక్ట్ రోజు డ్యూటీలు రాకుండా చూడాలని, పరీక్ష హాలులోకి విద్యార్థులను పంపించే ముందు క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సూచించారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

## వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

## సూర్యాపేటలో ఆటోను ఢీకొన్న బస్సు

## ప్రమాదంలో నలుగురు అక్కడిక్కడే మృతి

## ఔటర్‌పై కారు బోల్తా : ఒకరు మరణం





హైదరాబాద్,ఫిబ్రవరి28 : రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. ఔటర్‌పై కారు బోల్తా కొట్టి ఒకరు, సూర్యాపేటలో మరో నలుగురు మృత్యువాత పడ్డారు. సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం ఉదయం మోతె సమీపంలో ఆటో, బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే.. మునగాల మండలం రామసముద్రానికి చెందిన 15 మంది కూలీలు మోతె మండలం బురకచెర్ల గ్రామానికి మిరపకోత పనుల కోసం ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారి అండర్ పాస్ వంతెన వద్దకు రాగానే వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరుపై వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులను సూర్యాపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సౌభాగ్యమ్మ అనే మహిళ చనిపోయారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు మధిర డిపోకు చెందినదిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ప్రమాద సమయంలో ఆటోలో మొత్తం 12 మంది ఉన్నారని, వారంతా కూలీ పనుల కోసం వెళ్తుండగా ప్రమాదం బారినపడ్డారని పోలీసులు తెలిపారు. మునగాల మండలం రామ సముద్రానికి చెందిన కూలీలు మోతె మండలం బుర్కచర్లలో మిరప పనులకు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. క్షతగాత్రులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇకపోతే ఔటర్ రింగ్ రోడ్డుపై మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం బుధవారం ఉదయం సంగారెడ్డి జిల్లా రామేశ్వరం బండ గ్రామ సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డుపై చోటుచేసుకుంది. మేడ్చల్ నుంచి పటాన్ చెరు వస్తున్న బ్రీజ కారు.. అదుపుతప్పి డివైడర్ మధ్యలో నుంచి దూసుకుపోయి.. పటాన్ చెరు నుంచి మేడ్చల్ వెళ్లే రోడ్డు వైపు పల్టీలు కొడుతూ బోల్తా పడింది. ఈ ఘటనలో కారు పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పటాన్ చెరు పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ప్రమాదానికి గురైనవారి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇటీవల కాలంలో ఔటర్ రింగ్ రోడ్డుపై తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. 23వ తేదీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు కూడా.. పటాన్ చెరు ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదానికి గురై.. ఆమె మృతి చెందిన సంగతి తెలిసిందే. అతి వేగమే రోడ్డు ప్రమాదాలకు కారణంగా పోలీసులు చెబుతున్నా.. మనుషుల ప్రాణాలు గాల్లో కలిసి పోతుండ డంతో ఆందోళన కలిగిస్తోంది.

# కాంగ్రెస్ పథకాలతో ప్రజలకు లాభం లేదు

## ఊరడింపు పథకాలతో కడుపు నిండదు: లక్ష్మణ్

హైదరాబాద్,ఫిబ్రవరి28 : కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఏ పథకం ప్రజల కడుపు నింపదని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. మూడోసారి మోదీని ప్రధాని చేయడానికి దేశ వ్యాప్తంగా ప్రజలు కోరుకుంటు న్నారని అన్నారు. తొమ్మిది రోజులుగా విజయ సంకల్ప యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకునేలా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. అసదుద్దీన్ ఓవైసీపై పాతబస్తీలో వ్యతిరేకత వ్యక్తమవుతుందని తెలిపారు. బడా వ్యాపారులకు మాత్రమే ఓవైసీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. మతం పేరుతో మజ్లీస్ రాజకీయాలు చేస్తూ పాత బస్తీ ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు మజ్లీస్ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరుతుందన్నారు. ఉచితాల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకునే కార్యక్రమం చేపట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో గారడీ చేసి అధికారంలోకి వచ్చాక ప్రజలను మభ్య పెడుతుందని ఆరోపించారు.

# డ్రగ్స్‌పై విచారణకు హాజరు కాని క్రిష్



హైదరాబాద్,ఫిబ్రవరి28 : గచ్చిబౌలి రాడిసన్ హోటల్ డ్రగ్స్ కేసులో విచారణకు డైరెక్టర్. క్రిష్ హాజరు కాలేదు. విచారణకు రావాల్సిందిగా గచ్చిబౌలి పోలీసులు కోరారు. అయితే తాను ముంబైలో ఉన్నానని..మార్చి 1న శు క్రవారం విచారణకు హాజరవుతానని పోలీసులకు చెప్పాడు క్రిష్.డ్రగ్స్ కేసులో క్రిష్ ను ఏ10గా చేర్చిన సంగతి తెలిసిందే.. డైరెక్టర్ క్రిష్ కు డ్రగ్ పరీక్షలు చేస్తామన్నారు మాదాపూర్ డీసీపీ వినీత్. డ్రగ్స్ తీసుకున్న అనుమానితుల జాబితాలో డైరెక్టర్ క్రిష్ ఉన్నారని తెలిపారు. క్రిష్ ను విచారిస్తాం.. ఆయనకు రక్త,మూత్ర పరీక్షలు చేస్తే అసలు విషయం ఏంటో తెలుస్తుందన్నారు. క్రిష్ విచారణకు హాజరవుతానని చెప్పారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 9 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు.

# వంగరలో బండి కాన్వాయ్‌పై దాడి

- కోడిగుడ్లతో దాడి చేసిన దుండగులు
- పివి స్వగ్రామంలోనే ఇంతదారుణం అని బండి విమర్శ
- పివికి భారతరత్న ఇచ్చి మోడీ గౌరవించారని వెల్లడి



హన్మకొండ,ఫిబ్రవరి28 : భాజపా ఎంపీ బండి సంజయ్ కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరిగింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో బుధవారం చోటుచేసుకుంది. ప్రజాహిత యాత్రలో భాగంగా సంజయ్ అక్కడ పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో వంగరలో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఇంటిని సందర్శించారు. అనంతరం ముల్కనూర్ బయల్దేరుతుండగా ఇద్దరు వ్యక్తులు కోడిగుడ్లు విసరడంతో అవి కాన్వాయ్‌లోని మీడియా వాహనంపై పడ్డాయి. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని భాజపా నేతలు ఆరోపించారు. పోలీసులకు ముందే సమా చారం ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ పోలీసుల సమక్షంలో కోడిగుడ్లతో దాడి జరిగినా వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకు భద్రత అక్కర్లేదు. పోలీసులు నా తో రావొద్దు. నా రక్షణ మా కార్యకర్తలే చూసుకుంటారని మండి పడ్డా రు. ఈ ఘటనతో హనుమకొండ జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. బండి సంజయ్ ప్రజాహిత యాత్ర కాన్వాయ్ పై గుర్తు తెలియని దుండగులు కోడిగుడ్లతో దాడితో పోలీసులు కూడా అలర్ట్ అయ్యారు. భీమదేవరపల్లి మండలం వంగరలో ఘటన జరిగింది. పీవీ నరసింహారావు స్వగ్రామంలో పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి వెళ్తుండగా కాన్వాయ్ పై కోడిగుడ్లు పడటం స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీసింది. పీవీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల నుంచి ప్రధానిగా పనిచేసిన ఏకైక నాయకుడు పీవీ నర్సింహారావు అని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ ఠీవిగా, పీవీ బహుభాషా కోవిదుడు, కవిగా, రచయితగా, జర్నలిస్టుగా పనిచేశారని తెలిపారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాన్ని గట్టెక్కించి దేశానికి ఎనలేని సేవలను చేశారని చెప్పారు. అలాంటి వ్యక్తికి భారత రత్న ప్రకటించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని అన్నారు. పీవీలాంటి గొప్ప వ్యక్తి చనిపోతే కనీ సం ఢిల్లీలో అంత్య క్రియలు జరపకుండా పీవీ ఆత్మను, ఆయన కుటు ంబ సభ్యులను అడుగడుగునా అవమానించింది కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. పీవీని కాంగ్రెస్ పార్టీ ఎందుకు అవమానిం చిందో ఇప్ప టికీ వివరణ ఇవ్వలేదన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించి నా కాంగ్రెస్ నాయకులు సంతోషం వ్యక్తం చేయలేదని విమర్శించారు.

### జగిత్యాల మున్సిపాలిటీలో

# బిఆర్ఎస్‌కి ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికయ్యారు. గతంలో మున్సిపల్ చైర్మన్ గా ఉన్న బోగ శ్రావణి స్థానిక శాసన సభ్యులు జగిత్యాల మున్సిపాలిటీలో బిఆర్ఎస్‌పార్టీకి డాక్టర్ సంజయ్ కుమార్ కు వ్యతిరేకంగా పలు అరోపణ చేస్తూ చైర్పర్సన్ పదవికి రాజీనామా చేశారు మళ్లీ అదే సామాజిక వర్గానికి చెందిన అడువాల జ్యోతి కి చైర్పర్సన్ పదవి ఇవ్వాలని కోరిన శాసనసభ్యులు సంజయ్ కుమార్ తాను గతంలో వానికి సమిండ్ల వాణి శ్రీనివాస్ కు మాట ఇచ్చానని అందుకు అనుగుణంగా ఈసారి ఆమెను ఎన్నుకోవాలని కౌన్సిలర్లను కోరారు. కొంతమంది కౌన్సిలర్లతో కలిసి గోవా లో క్యాంపు నిర్వహించిన ఫలితం లేకుండా పోయింది. చైర్ పర్సన్ ఎన్నిక కు సహకరించిన 12 బి.ఆర్.ఎస్. 7 గురు కాంగ్రెస్, బీజేపీ 2, ఇండిపెండెంట్ 02, ఎంఐఎం 01 కౌన్సిలర్లు తన సమీప ప్రత్యర్థి సమిండ్ల వాణి పై ఒక్క ఓటు ఆధిక్యంతో అడువాల జ్యోతి (బి.ఆర్.ఎస్.) మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. అడువాల జ్యోతి కి 24 ఓట్లు రాగా, సమిండ్ల వాణి కి 23 ఓట్లు వచ్చాయి.

# తెలంగాణ వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



- ఆదిలాబాద్‌లో ప్రమాదానికి గురైన విద్యార్థి
- నిముషం ఆలస్యం నిబంధనతో కొందరికి నిరాకరణ



హైదరాబాద్,ఫిబ్రవరి28 : తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభం అయ్యా యి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. అయితే ఆది లాబాద్ జిల్లాలో బైక్‌పై వస్తున్న విద్యార్థి బస్సును ఢీకొని గాయ పడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించడంతో పరీక్ష రాయలేకపో యాడు. బుధవారం నుంచి మొదలైన పరీక్షలు మార్చి 19 వరకు జరగనున్నాయి. ఉదయమే పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్షలకు హాజర య్యారు. వీరి కోసం ప్రత్యేక బస్సులు కూడా ఏర్పా టు చేశారు. నిమిషం ఆలస్యం అయినా ఎగ్జామ్ హాల్ లోకి అధికారులు అనుమతించ లేదు. నిమి షం నిబంధన కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు ఎగ్జామ్ సెంటర్ నుంచి వెను దిరిగి వెళ్లిపో యారు. కుత్బుల్లాపూర్ గాంధీ నగర్ లోని కేమ్ బ్రిడ్జ్ కళాశాల లో ఇద్దరు విద్యార్థులు నాలుగు నిమిషాలు ఆలస్యంగా రావ డంతో, కళా శాల యాజమాన్యం పరీక్షా కేంద్రాల లోపలికి అను మతించ లేదు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట ప్రభుత్వ బాలుర కళా శాలకు ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలకు ఇద్దరు విద్యా ర్థులు ఆలస్యంగా రావ డంతో అధికారులు అను మతించకపో వ డంతో వెనుదిరి వెళ్లారు విద్యా ర్థులు. బైంసా ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు ఆలస్య ంగా రావడంతో ఎగ్జామ్‌కు అధికారులు అనుమ తించకపోవడంతో వెళ్లిపో యా రు విద్యార్థులు. మొదటి, రెండో సంవత్సరాలకు కలిపి 9,80,978 మంది పరీక్ష రాయనున్నారు. మొదటి సంవ త్సరంలో 4,78,718, రెండో సంవత్సరంలో 5,02,260 మం ది హాజరు కానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,521 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించ బోమని అధికారులు స్పష్టం చేశారు. ఎవరైనా కాపీ కొట్టినా.. ఒక వ్యక్తికి బదులు మరో వ్యక్తి పరీక్ష రాసినా క్రిమినల్ కేసు నమోదు చేయనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. విద్యార్థులు ఆయా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఇదిలావుంటే ఇంటర్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం వడూర్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ (17) ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. పరీక్ష రాసేందుకు బుధవారం ఉదయం బైక్‌పై ఇచ్చోడకు బయల్దేరాడు. మార్గమధ్యంలో హైవేపై బస్సు నిలిపి ఉండటంతో వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. దీంతో విద్యా ర్థి తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108కు సమాచా రం ఇవ్వడంతో ఇచ్చోడ పీహెచ్‌సీనిక తరలించారు. అక్కడి నుం చి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

## కవిత కేసు విచారణ 13కు వాయిదా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి28 : మహిళలను దర్యాప్తు సంస్థలు ఇంట్లోనే విచారించాలనే అంశంపై భారాస ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మార్చి 13కు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరగాల్సి ఉంది. అయితే, కోర్టు సమయం ముగియడంతో తదుపరి విచారణను త్వరగా జరపాలని కవిత తరఫు న్యాయవాది కపిల్ సిబల్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. మార్చి 13న చూస్తామని ధర్మాసనం తెలిపింది. కాగా, మద్యం కేసులో విచారణకు రావాలని ఈడీ జారీ చేసిన నోటీసులను గతేడాది కవిత సవాలు చేశారు. గతంలో ఆమె పిటిషన్‌ను నళినీ చిదంబరం, అభిషేక్ బెనర్జీ కేసులతో జత చేసిన విషయం తెలిసిందే. పిటిషన్లపై విడివిడిగానే విచారణ చేపట్టనున్నట్లు గత విచారణలో జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం స్పష్టం చేసింది. 3 కేసులు వేర్వేరు అని, కలిపి విచారణ చేయడం సబబు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది.

## కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ బిజినెస్

### నలుగురు వ్యక్తుల ముఠా అరెస్ట్

హైదరాబాద్,ఫిబ్రవరి28 : హైదరాబాద్‌లో అల్లం వెల్లుల్లి పేస్ట్ కల్తీ దందా జోరుగా సాగుతోంది. కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ను తయారు చేసి అమ్ముతున్న ముఠాను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. డక్కన్ ట్రేడర్స్ పేరుతో ఉప్పర్ పల్లిలో కల్తీ జింజర్ పేస్ట్ తయారు చేస్తుంది ముఠా. బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాటిగడ్డ కేంద్రంగా స్టోర్ చేసి అమ్ముతున్నారు. ఈ దందా చేస్తున్న నలుగురు వ్యక్తులను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.. వీరి నుంచి 700 కిలోల కల్తీ పేస్ట్, 625 కేజీల నాసిరకం వెల్లుల్లి, 100 కిలోల నాసిరకం అల్లం, కెమికల్స్ ను సీజ్ చేశారు. పట్టుబడిన ఈ కల్తీ జింజర్ పేస్ట్ విలువ ఐదు లక్షల ఉంటుందని పోలీసులు తెలిపారు. బేగంబజారులోని రెండు దుకాణాలపై కూడా పోలీసులు దాడులు చేశారు. పెద్ద మొత్తంలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ లభ్యమైంది. నిందితులు పాటిగడ్డకు చెందిన పాండు రంగారావు, డెక్కన్ ట్రేడర్స్ యజమాని రహీం, అజయ్ కుమార్, అహీర్, తెలంగాణ ఏజెన్సీ యాజమాన్యం ప్రదీప్ సంక్లా , నిఖిల్ ట్రేడర్స్ యజమానిగా గుర్తించారు. నిందితులు నగరంలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ల తయారీ చేసి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కల్తీ బిజినెస్ లో ప్రధాన నిందితుడు గుజరాత్ కు చెందిన రహీం చరణీయ ఉప్పర్ పల్లి, రాజేంద్ర నగర్ లో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టులను తయారు చేసేందుకు అక్రమ తయారీ యూనిట్ ను ఏర్పాటు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. పాండు రంగారావు, అజయ్ కుమార్, అహీర్, ప్రదీప్ సంక్లా ఏజెంట్లుగా తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. సాధారణ దుకాణాల్లో వీరు ఈ కల్తీ సరుకును అమ్ముతున్నట్లు గుర్తించారు. కల్తీ పేస్ట్ తిన్నట్లయితే వాటిలో రసాయనాలు, విషపూరిత పదార్థాలు ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉంది. నిందితులపై పలు ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

## ఔటర్‌రింగ్ టోల్ టెండర్లలో అవకతవకలు

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని అధికారులకు ఆదేశించారు. మాస్టర్ ప్లాన్-2050కి అనుగుణంగా.. విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని తెలిపారు. ఇదే సమయంలో.. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డుకు రేడియల్ రోడ్లకు ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ - 2050కి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్ రూపొందించాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతాలను ఓ యూనిట్ గా తీసుకుని అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని.. రీజనల్ రింగ్ రోడ్డు పరిధి లోపల ఉన్న ప్రాంతాన్ని హెచ్ఎండీఏ పరిధిలోకి తీసుకు రావాలని చెప్పారు. హైదరాబాద్ ఈస్ట్ - వెస్ట్ అనే తారతమ్యాలు లేకుండా నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని నిర్దేశించారు. కాగా, తెలంగాణ అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ తీసుకువస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో వెల్లడించారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు అనువైన ప్రాంతమని.. ప్రపంచంతో పోటీ పడుతోందని చెప్పారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రీజనల్ రింగ్ రోడ్డును త్వరలోనే తీసుకు వస్తామని పేర్కొన్నారు. రింగ్ రోడ్డు చుట్టూ మెట్రో రైల్ సదుపాయం కూడా కల్పిస్తామని అన్నారు. త్వరలో విజన్ - 2050 దిశగా తాము ముందుకు వెళ్తున్నామని.. అర్బన్, రూరల్ తెలంగాణను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. మహానగరాన్ని అర్బన్, సెమీ అర్బన్, రూరల్ ఇలా 3 భాగాలుగా అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తామని వివరించారు. అందుకు అనుగుణంగానే తాజాగా అధికారుల సమీక్షలో ఆదేశాలిచ్చారు.

## ఇస్రో లాంచ్‌ప్యాడ్‌కు మోడీ శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

సైతం అధికార డీఎంకేపై నిప్పులు చెరిగారు. డీఎంకే పనిచేయకపోవడమే కాకుండా తప్పుడు క్రెడిట్ ఆపాదించుకుంటోందని, కేంద్రం పథకాలపై వాళ్ల స్టిక్కర్లు అంటించుకున్నారని, ఇస్రో లాంచ్‌ప్యాడ్‌పై చైనా స్టిక్కర్ అంటించి క్రెడిట్ వారికి ఆపాదిస్తున్నారని విమర్శించారు. అంతరిక్ష రంగంలో భారతదేశ ప్రగతిని అంగీకరించేందుకు వాళ్లు (డీఎంకే) సిద్ధంగా లేదన్నారు. అంతరిక్ష రంగంలో భారత విజయాలను ప్రపంచానికి చాటేందుకు ఇష్టపడటం లేదని, మన శాస్త్రవేత్తలను, మన అంతరిక్ష కేంద్రాన్ని కూడా విమర్శిస్తున్నారని తప్పుపట్టారు. వాళ్లు చేసిన తప్పిదాలకు శిక్ష విధించే సరైన సమయం ఇదేనని అన్నారు. చైనా రాకెట్ యాడ్‌పై మోదీ వ్యాఖ్యలను డీఎంకే ఎంపీ కె.కనిమొళి తిప్పికొట్టారు. యాడ్ ఫోటోలో ఆర్ట్ వర్క్ చేసిన వ్యక్తి ఎవరో తనకు తెలిదని అన్నారు. చైనాను శత్రుదేశంగా భారత్ ప్రకటించినట్టు తాను అనుకోవడం లేదని చెప్పారు. 'మన ప్రధాని చైనా ప్రధానిని ఆహ్వానించాను. కలిసి మహాబలిపురం వెళ్లారు. నిజాన్ని ఒప్పుకోవడానికి మీరు (ప్రధాని) సిద్ధంగా లేనందునే సమస్యను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మీరు చేస్తున్నారు' అని కనిమొళి వ్యాఖ్యానించారు.

## హెచ్‌ఎండీఏలో విజిలెన్స్ సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 3,500 చెరువుల డాటా ఆన్‌లైన్‌లో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే చెరువుల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతోఅవినీతి, అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలకు రంగం సిద్ధమైంది. అక్రమ లే-అవుట్, బిల్డింగ్ అనుమతులపై దర్యాప్తు చేస్తున్నారు. హెచ్‌ఎండీఏలో కొన్ని రోజుల క్రితం ఏసీబీ కూడా దాడులు నిర్వహించింది. ఫైళ్లను పరిశీలించే క్రమంలో హెచ్‌ఎండీఏలోని ఘట్‌కేసర్, శంషాబాద్,శంకర్‌పల్లి జోన్‌లకుచెందిన ప్లానింగ్‌అధికారులు,ఏపీఓలను తమ వద్ద కు రప్పించిపలుఅనుమతులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యంగా 2018 నుంచి 2023 వరకు పని చేసిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ హయాంలో ఇచ్చిన హై రైజ్ భవనాల అనుమతులపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ఒకవైపు విజిలెన్స్ సోదాలు కొనసాగుతుండగానే.. హెచ్‌ఎండీఏపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.అవినీతి వ్యవహారంపై సీఎం సీరియస్ అయ్యారు. పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. విజిలెన్స్ విచారణతో నిగ్గు తేల్చాలని నిర్ణయం తీసుకున్న సీఎం.. సమీక్షలో దాడులపై ఆరా తీశారు.

## రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ హవా..

(మొదటిపేజీ తరువాయి)

సమాజ్‌వాదిపార్టీ,కాంగ్రెస్‌లు బోల్తా పడ్డాయి. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేసిందన్న ఓటమి పాలైన పార్టీలు దుమ్మెత్తిపోశాయి. సీఆర్పీఎఫ్ బలగాలతో తమ శాసన సభ్యులను బీజేపీ కిడ్నాప్ చేసి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిందని హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు చేసిన ఆరోపణలతో క్రాస్ ఓటింగ్ ఏస్థాయిలో జరిగిందో అర్థమవుతోంది. పాలక పక్షమైన కాంగ్రెస్‌కు శాసనసభలో కావాల్సినంత బలమున్నప్పటికీ నిన్న జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వి ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీకి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ చేశారు. వీరితో పాటు మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు కూడా బీజేపీకి తోడుకావడంతో ఆ పార్టీ అభ్యర్థి గెలుపు సాధ్యమైంది. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్‌లకు చెరో 34 ఓట్లు రావడంతో డ్రా తీశారు. ఈ డ్రాలో బీజేపీ అభ్యర్థి హర్ష మహాజన్ విజయం సాధించడంతో ఉత్కంఠకు తెరపడింది. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలవ్వడంతో ఆ పార్టీపై రేపు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైనందున హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖవిందర్ సింగ్ సుఖు తక్షణం రాజీనామా చేయాలని మాజీ సీఎం, బీజేపీ నేత జైరాం ఠాకూర్ డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మెజారిటీ కోల్పోయిందని ఆయన అన్నారు. తమపార్టీ బలం 25కు పెరిగిందని ఠాకూర్ ఈసందర్భంగా వెల్లడించారు.కాంగ్రెస్ పరాజయానికి సీఎం సుఖు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. ఇదిలావుండగా, కాంగ్రెస్ ఓటమితో బలంపుంజుకున్న బీజేపీ రేపు శాసనసభలో అవిశ్వాస తీర్మానం పెట్టే యోచనలో ఉంది. అదే జరిగితే కాంగ్రెస్ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాలలో ఒకదాన్ని కోల్పోయే పరిస్థితి దాపురించవచ్చు. మరికొద్ది నెలల్లో 56 మంది రాజ్యసభ సభ్యుల స్థానాలు ఖాళీ అవుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం వాటి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 41 స్థానాలు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 15 స్థానాలకు మంగళవారం ఎన్నికలు జరిగాయి.కర్ణాటక, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ మూడు రాష్ట్రాలకు సంబంధించి జరిగిన ఈ ఎన్నికల్లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు పోలింగ్ పూర్తి కాగా, 5గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించారు.

## కేంద్రానికి లొంగిపోయిన జగన్..రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు

- చంద్రబాబును లొంగదీసుకునే యత్నాలు
- దర్యాప్తు సంస్థలతో కేంద్రం దాడులు దారుణం
- సిపిఐ నేత నారాయణ ఘాటు విమర్శలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి28 : ఏపీ ముఖ్యమంత్రి జగన్ ఎప్పుడో కేంద్రానికి లొంగిపోయాడని, కేంద్రం ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను వాడి విపక్షాలపై దాడులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 17 ఏ కత్తి పెట్టి చంద్రబాబును లొంగదీసుకోవలనే ప్రయత్నం చేస్తోందన్నారు. పిరికిపంద రాజకీయాలు చేసేవారు రాజకీయాల్లో ఉండటం సరికాదని, సొంత ప్రయోజనాలకోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టొద్దని ఆయన అన్నారు. జగన్ తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, జగన్ తన తండ్రి పేరు చెడగొట్టేందుకే పుట్టాడన్నారు. ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం కోసం పోరాటం చేశారని, విభజన హామీలు అమలు చేయకపోయినా.. బీజేపీ కాళ్ళు పట్టుకోవడం దారుణమని నారాయణ అన్నారు.స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టకండని హితవు పలికారు. కేంద్ర బీజేపీ సర్కార్ అడ్మినిస్ట్రేషన్ ను ఉపయోగించుకొని ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేస్తుందని నారాయణ అన్నారు. లిక్కర్ స్కాం కేసులో అసలు నిందితులను వదిలి కేజీవ్రాల్ టీంను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. రాముడు, కృష్ణున్ని అడ్డంపెట్టుకుని ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలకు మేలు చేసి ఉంటే ఇన్ని జిమ్మిక్కులు చేయాల్సిన అవసరం వచ్చేదికాదన్నారు. 'మోదీ సర్కార్ ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను వాడి విపక్షాలపై దాడులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంది. 17 ఏ కత్తి పెట్టి చంద్రబాబును లొంగదీసుకోవాలనే ప్రయత్నం చేస్తోందన్నారు. జగన్ ఎప్పుడో కేంద్రానికి లొంగిపోయాడు. రూ.45 వేల కోట్లు దోచి..11 కేసుల్లో నిందుతుడిగా ఉన్న ఆయనపై చర్యలు లేవు. పిరికిపందలు రాజకీయాల్లో ఉండటం సరికాదు, స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టొద్దు. జగన్ తన తండ్రి పేరు చెడగొట్టేందుకే పుట్టాడు. కాంగ్రెస్ సీపీఐ, సీపీఎం కలిసి బీజేపీ, చంద్రబాబు, జగన్ లకు వ్యతిరేకంగా పోరాడుతామని అన్నారు. దేవుళ్లను కలిసే మోదీ సమస్యల్లో ఉన్న ప్రజలను ఎందుకు కలవరు? విగ్రహాలు తెచ్చానని గొప్పలు చెప్పుకునే ప్రధాని.. లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వాళ్లను ఎందుకు వెనక్కి తీసుకురాలేకపోతున్నాడో బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## రేవంత్‌కు సవాల్ చేసే హక్కు లేదు

### కొడంగ్‌లో ఓడినా ఎంపిగా పోటీ చేశారు

### మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్య



హైదరాబాద్,ఫిబ్రవరి28 : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో.. తెలంగాణలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సీఎం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సవాల్ విసిరే అర్హత ముఖ్యమంత్రికి లేదని, గతంలోనూ ఓ సవాల్ చేసి రేవంత్‌రెడ్డి తోక ముడిచారని అన్నారు. తాను కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసు కుంటానని రేవంత్ చెప్పారని.. కానీ ఆ మాట తప్పారని.. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారని అన్నారు. ఇదే సమయంలో బాల్క సుమన్ కాంగ్రెస్ పార్టీకి ఓ సవాల్ విసిరారు. దమ్ముంటే రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి.. పార్లమెంట్ ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, హామీలను నమ్మి జనం ఓటు వేస్తే.. ప్రభుత్వం వాళ్లకు శఠగోపం పెడుతోందని ఆరోపించారు. ఎన్నికల ముందు అందరికీ గృహజ్యోతి ఇస్తామని చెప్పి.. ఇప్పుడు కోతలు పెడుతున్నారని విమర్శించారు. తెల్ల రేషన్ కార్డ్ ఉన్న వాళ్లందరికీ రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని కోరారు. కోటి పది లక్షల మంది గృహ విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని పేర్కొన్నారు. కాళేశ్వరంలో బ్యారేజ్‌లు కొట్టుకుపోవాలని కుట్ర చేస్తున్నారని బాల్క సుమన్ వ్యాఖ్యానించారు. మేడిగడ్డకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు ఎవరూ భయపడరని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జరిగిన చెల్లింపులపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. అర్హులైన వారికి వెంటనే రైతుబంధు ఇవ్వాలని.. మెగా డీఎస్సీ వేయడంతో పాటు నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు.

## మేడిగడ్డకు కెసిఆర్ కూడా వెళ్లాలి

- కుంగిన తీరుపై ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచన

హైదరాబాద్,ఫిబ్రవరి28 : భారాస నేతల మేడిగడ్డ బ్యారేజీ పర్యటనను స్వాగతిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇంత భారీగా అవినీతి చేసి కూడా మేడిగడ్డకు వెళ్తామంటున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ జలసౌధలో ఆయన మాట్లాడారు. 'భారాస నేతల మేడిగడ్డ పర్యటనకు సహకరించాలని అధికారులను ఆదేశించాం. వారి తీరు 'ఉల్టా చోర్..' సామెతను గుర్తు చేస్తోంది. భారాస మేడిగడ్డ పర్యటనకు కేసీఆర్ సైతం వెళ్లాలి. కుంగిన ఆనకట్ట సాక్షిగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కట్టవద్దని నిపుణుల కమిటీ సూచించింది. కాళేశ్వరం రూపంలో రాష్ట్రంపై మోయలేని భారం మోపారు. స్వతంత్ర భారతంలో ఇంత భారీ అవినీతి గతంలో ఎన్నడూ జరగలేదు. ప్రాజెక్టుల విషయంలో భారాస సర్కారు అవినీతిని కాగ్ ఎండగట్టింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా వివరించింది' అని చెప్పారు. కమిషన్ల కోసమే గత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం చేసిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఇంకా ప్రాజెక్టులు పూర్తి కావడానికి లక్షాల 47 వేల కోట్లు కావాలన్నారు ఉత్తమ్. కాళేశ్వరంలో 25వేల కోట్లు పనులు ఎలాంటి డీపీఆర్ లు లేకుండా అలాట్ చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో 94 వేల కోట్ల రూపాయలు కాళేశ్వరం కోసం ఖర్చు చేసి ఐదేళ్లలో 160 టీఎంసీల నీళ్లను మాత్రమే లిఫ్ట్ చేశారని చెప్పారు. ఇందులో ఇరిగేషన్ కోసం వినియోగించింది కేవలం 65 టీఎంసీలే అన్నారు. బీఆర్ ఎస్ తన తప్పును కప్పి పుచ్చుకునేందుకే జిమ్మిక్కులు చేస్తుందన్నారు. మేడిగడ్డపై నిజాలు చెప్పకుండా తప్పుడు ప్రచారం చేస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బీఆర్ ఎస్ నేతలు మేడిగడ్డలో పర్యటిస్తామంటున్నారు.. బీఆర్ ఎస్ అవినీతికి ప్రాజెక్టు ఎలా బలైందో చూసి రావాలని మేం స్వాగతిస్తున్నామన్నారు. తంత్ర భారతంతో ఇంత అవినీతి ఎప్పుడూ జరగలేదన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు ప్రాజెక్టులు డ్యామేజ్ అయ్యాయని.. ఆ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సాధ్యం కాదని.. మేడిగడ్డ సాక్షిగా ప్రజలకు బీఆర్ ఎస్ నేతలు క్షమాపణలు చెప్పాలన్నారు.

## రేవంత్‌పై కెటిఆర్ వ్యాఖ్యలు



### క్షమాపణలు చెప్పాలన్న కాంగ్రెస్

హైదరాబాద్,ఫిబ్రవరి28 : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని, బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండ్రు శోభా రాణి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పుతో కేటీఆర్ చిన్న మెదడు చితికిపోయి మాట్లాడుతున్నారని సెటైర్లు వేశారు. బీఆర్ఎస్ నేతలందరూ ఆసుపత్రిలో చూపించుకోవాలని దుయ్యబట్టారు. లంకె బిందెల్లాంటి రాష్ట్రాన్ని దివాళా తీసేలా చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో రాష్ట్ర ఖజానాని హరీష్ రావు ఖాళీ చేశారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలకి విముక్తి లభించిందని పేర్కొన్నారు. ఆస్తుల చిట్టాని కేసీఆర్ కుటుంబం బయటపెట్టాలని కోరారు. కేటీఆర్ క్షమాపణ చెప్పకపోతే క్రిమినల్ కేసు పెడతామని ఆమె హెచ్చరించారు. ఇదిలావుండగా.. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసుకొని కేటీఆర్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం అభ్యర్థిగా రేవంత్ రెడ్డిని ముందే ప్రకటించి ఉంటే, కాంగ్రెస్ పార్టీకి కనీసం 30 సీట్లు కూడా వచ్చేవి కావని కుండబద్దలు కొట్టారు. అసలు రేవంత్ రెడ్డి ఒక ముఖ్యమంత్రిలా మాట్లాడడం లేదని, అతని పాత బుద్ధులన్నీ మెల్లగా బయటకు వస్తున్నాయని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తామని స్వయంగా కాంగ్రెస్ వాళ్లే ఊహించలేకపోయారని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీపై ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డిలో రోషం పొడుచుకుని వస్తోందన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఇటుకలతో కొడితే, తాము రాళ్లతో కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదన్నారు. ఈ విధంగా వ్యాఖ్యలు చేయడంతో.. కేటీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నారు. కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

## మరో ఐదుగురు ఐఎఎస్‌ల బదిలీ

### ఆదిలాబాద్ కలెక్టర్‌గా రాజర్షి షా




హైదరాబాద్,ఫిబ్రవరి28 : తెలంగాణలో ఐఏఎస్ అధికారుల బదిలీలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా మరో ఐదుగురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. మెదక్ కలెక్టర్‌గా రాహుల్ రాజ్, ఆదిలాబాద్ కలెక్టర్‌గా రాజర్షి షా, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్‌గా స్నేహ శబరీశ్, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా బీహెచ్ సహదేవ్‌రావు, హైదరాబాద్ అదనపు కలెక్టర్‌గా హేమంత కేశవ పాటిల్ నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

## నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్

### మండిపడ్డ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య

హైదరాబాద్,ఫిబ్రవరి28 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మాట మారుస్తూ నిరుద్యోగులను మోసం చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆరోపించారు. మొత్తం 26 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా ఐదు వేలు, పదివేల ఉద్యోగాలంటూ మోసపూరిత నాటకానికి తెరలేపుతున్నారని మండిపడ్డారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖలోని కొంత మంది అధికారుల మాటలు నమ్మి ప్రభుత్వం గుడ్డిగా ముందుకు వెళ్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే టెట్(ౕఇౕ) నిర్వహించి, పూర్తి స్థాయిలో టీచర్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ నేత ప్రధానిగా ఉండి కూడా వెనకబడిన వర్గాలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్ లు, సమాన వాటా కోసం దశాబ్దాలుగా పోరాటం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం సమస్యను పరిష్కరించ కుండా మోసం చేస్తుందని మండిపడ్డారు. అన్ని వర్గాలు ఆరాధించే రాముడిని తమ వాడు అన్నట్లు దేవుడిని రాజకీయాల కోసం వాడుకుంటున్నారని, 60 శాతం బీసీలు పేదరికంలో మగ్గుతుంటే వికసిత భారత్ అంటూ ఊదరగొడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా, చట్టసభల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్‌లు, కులగణన చేపడతామని అన్ని పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని డిమాండ్ చేశారు.

## మహిళలను కించపరిచేలా రేవంత్ వ్యాఖ్యలు

- ఇందిరమ్మ రాజ్యం అంటే మహిళలను అగౌరవపర్చడమేనా
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆగ్రహం

హైదరాబాద్,ఫిబ్రవరి28 : మహిళలను కించపరిచే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగానే రేవంత్ రెడ్డి భాష ఉందని.. ముఖ్యమంత్రి అనే సోయి ఆయనకు లేదని మండిపడ్డారు.ఇందిరమ్మ రాజ్యం అంటూ మహిళలను అగౌరవపర్చే విధంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడిన సత్యవతి రాథోడ్.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఎన్ని హామీలు ఉన్నాయో రేవంత్ రెడ్డికి తెలుసా అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల్లో మొత్తం 13 హామీలు ఉన్నాయన వివరించారు. మహాలక్ష్మి పథకం కిందనే మూడు హామీలు ఉన్నాయని సత్యవతి రాథోడ్ అన్నారు. మహిళలకు ఇస్తామన్న 2,500 రూపాయల హామీ ఏమైందని ప్రశ్నించారు. 500 రూపాయల గ్యాస్ సబ్సిడీ 40 లక్షల మందికి మాత్రమే వర్తిస్తుందని.. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులకు ఈ స్కీం వర్తింపజేయాలని అన్నారు. గ్యాస్ కనెక్షన్లు కేవలం మహిళల పేరు మీద ఉంటేనే సబ్సిడీ వస్తుందని ప్రభుత్వం చెప్తోందని.. గ్యాస్ కనెక్షన్లు పురుషుల పేరు మీద ఉన్నా సబ్సిడీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పథకం బోగస్ పథకంగా మారిందని ఆమె ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మారుమూల గ్రామాలకు కూడా ఆర్టీసీ బస్సులను నడపాలని సత్యవతి రాథోడ్ కోరారు. మహిళలకు సరిపడా బస్సులను ప్రభుత్వం నడపాలని డిమాండ్ చేశారు.

ఆరు గ్యారెంటీల చట్టబద్ధత ఏమైందని నిలదీశారు. పింఛన్లు 4,000 ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని ఆరోపించారు. గుడ్డిగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఆరు గ్యారెంటీలు అని చెప్పి ఆరు వందల కొర్రీలు పెడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పరుష పదజాలం మానుకోవాలని సత్యవతి రాథోడ్ హితవు పలికారు. కేసీఆర్ కుటుంబాన్ని తిట్టడమే రేవంత్ రెడ్డి ఎజెండాగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి సీటును టచ్ చేసే వాళ్లు పక్కనే ఉన్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నారని అన్నారు. తాను జైలుకు వెళ్లానని అందరిని జైలుకు పంపాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారని విమర్శించారు. దళితులు, గిరిజనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం 100 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇచ్చిందని సత్యవతి రాథోడ్ గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా ఇచ్చేది 100 యూనిట్లేనా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పంచిన ఉద్యోగ నియామక పత్రాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించినవే అని గుర్తుచేశారు. రైతులకు ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని మండిపడ్డారు. అసలు రాష్ట్రంలో కౌలు రైతులను ఏ విధంగా గుర్తిస్తారని ప్రశ్నించారు. రైతులకు ఇస్తామన్న బోనస్ ఏమైందని నిలదీశారు. మేడిగడ్డను రిపేర్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని అన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలి!

కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు. ప్రతిదానికి కేంద్రం సాయాం చేయాలని దేబిరిస్తున్నాయి. అదేపనిగా అప్పులు చేస్తూ ప్రజలపై భారం మోపుతున్నాయి. తెలంగాణనే తీసుకుంటే 75వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తోందని సిఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు చూస్తే గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ఎంతగా పెరిగాయో గమనించవచ్చు. ప్రభుత్వ నిర్వహణ అంటే కేవలం అప్పులు చేసి, ప్రజలకు నగదు బదిలీ చేయడం అని జగన్ నిరూ పించారు. రాష్ట్రాలన్ని ఇలా దివాళా దిశగా ఉన్నాయి. ఎక్కడా అభివృద్ధి కన్నా ఓట్లు రాబట్టే పథకాలే సాగుతున్నాయి. ఇందుకు ఏ రాష్ట్రం కూడా మినహాయింపు కాదు. అభివృద్ధి పక్కకు పోయింది. తెలంగాణలో కాళేశ్వరంపై తప్పులు ఒప్పుకోకుండా బిఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. ఏ పథకం తీసుకున్నా అవినీతి కనిపిస్తోంది. నోరుంది కదాని బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విపరీత వ్యాఖ్యలు,ఆరోపణలు జుగుప్స కలిగిస్తున్నాయి. ఇకపోతే కేంద్రంలో మోడీ ద్వయం రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని చేస్తున్న విన్యాసం చూపరులకు విసుగు తెప్పిస్తోంది. అయితే మోడీని ప్రశ్నించే ముందు తమ రాష్ట్రాల్లో తాము ఎంత సచ్చీలంగా పాలన చేస్తున్నామో ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు గమనించాలి. ప్రజలు చేస్తున్నవిమర్శలకు సమాధానం చెప్పాలి. అలాగని కేంద్రం అధికార దుర్వినియోగాన్ని తప్పు పట్టకుండా ఉండలేం. కేంద్రం చేస్తున్న దుర్వినియోగాన్ని, దుర్మార్గాలను ఎండగట్టాల్సిందే. ఇకపోతే ఆదానీ కుంభకోణాలపై, మోసాలపై చలనం లేని బిజెపి ప్రభుత్వం..సిసోడియా విషయంలో మాత్రం దూకుడు ప్రదర్శించింది. నిజానికి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు కేవలం కక్షసాధింపు వ్యవహారంగా కనిపిస్తోంది. ఎంతమంది అవినీతికి పాల్పడ్డారో వారందరినీ ఒకే గాటన కట్టివుంటే బాగుండేది. రాజకీయ అవినీతిని, కార్పోరేట్ మోసాలను అరికట్టే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ మోడీ మాత్రం విమర్శలను పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యాన్ని పట్టించు కోవడం లేదు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఎంతకాలం ఇలా ముందుకు వెళతారన్నది చూడాలి. సిబిఐ, ఐటి, ఇడి దాడులపై వస్తున్న ఆరోపణలను పట్టించు కోవడం లేదు. ఆయా రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి అధికారాన్ని చేజిక్కించు కుంటున్న తీరు కాంగ్రెస్ పాలనకన్నా దారుణంగా ఉంది. వ్యవస్థలను భ్రష్టు పట్టించిన ఘనత కాంగ్రెస్ దయితే..అంతకుమించిన దారుణా లను ఇప్పుడు మోడీ అనుసరిస్తున్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టే ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదు. ప్రజల సమస్యలను ప్రధానంగా పరిష్కరిస్తూనే...అవినీతి నేతలను బొక్కలో తోయాల్సిందే. రాజ్యాంగ సంస్థలు అందరి విషయంలో సమన్యాయంతో వ్యవహరించాల్సిన బాధ్యత వుంది. భారత ప్రజాస్వామ్యం పదికాలాలపాటు పటిష్టంగా నిలదొక్కుకోవాలంటే రాజ్యాంగ వ్యవస్థలు పటిష్టంగా పనిచేయాలి. నిష్పాక్షి కంగా నిర్ణయాలు తీసుకోవాలి. అధికారంలో ఉన్న సమయంలో అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా ఉండరాదు. ఇది ఒక్క కేంద్రం విషయంలో మాత్రమే జరగడం లేదు. రాష్ట్రాల్లో నూ ఇలాగే వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. కేంద్రాన్ని విమర్శిస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉంటే అవి రాజకీయ జోక్యంతో రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుంటు న్నాయి. అందుకే రాజ్యాంగ సంస్కరణలు రావాలని కొందరు మేధావులు కోరు కుంటున్నారు. ప్రధానంగా వివిధ దర్యాప్తు సంస్థలు, ఎన్నికల సంఘం,ప్రణాళికా సంఘం అంటే నీతి ఆయోగ్, యూనియన్ పబ్లిక్ సర్వీస్కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్జనరల్ వంటి అనేక సంస్థలు జవాబు దారీగా ఉండేలా పటిష్ట రాజ్యాంగం అవసరం. దేశ సమాఖ్య విధానంలో సహకార స్ఫూర్తిని పెంపొందించాల్సిన కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. భారత రాజ్యాంగ సంస్థల పట్ల విశ్వసనీయత పెరగాలి. అవి తీసుకునే నిర్ణయాలు ఏకపక్షంగా ఉండకుండా చూసుకోవాలి. అందుకు దేశవ్యాప్తంగా చర్చచేయాలి. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని స్వారీ చేసే పాలకుల తీరు మారాలి. ఇలాంటి పాలకులు వస్తారని బహుశా రాజ్యాంగ రచన చేసిన వారు ఊహించ ఉండరు. అందువల్ల వ్యవస్థలను బలోపేతం చేస్తూ..రాజకీయజోక్యం లేని పాలనా సంస్థలను రూపొందించుకోవాలి. కేంద్రంలో లేదా రాష్ట్రంలో అధికరాంలో ఉన్న పార్టీలు తమ అవసరాలకు వాటిని దుర్వినియోగం చేసే విధానాలకు చెక్ పెట్టాల్సిన అసవరం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే పాలకులు స్వారీ చేస్తారని ప్రజలు గుర్తించాలి. ఇలా ప్రజలు నిద్రలో ఉన్నంత కాలం పాలకుల తమ విధానాలనే రుద్దుతారు. తాము చేసిందే కరెక్ట్ అని చెబుతారు. దీనిని అడ్డుకోవడం అన్నది ప్రజలు తమ కర్తవ్యంగా గుర్తించాలి. తాము అప్పగించిన అధికారం దుర్వినియోగం కాకుండా చూసుకోవాలి. ఎన్నికల వేళ ఇలాంటి అనర్థాలపై ప్రజలు చర్చించాలి. రాజ్యాంగ వ్యవస్థల పనితీరు, పాలకుల పనితీరు, అవినీతి పాలనలపై చర్చించాలి. ఎవరు అవినీతికి పాల్పడినా క్షమించరాదు. అందుకు అనుగుణంగా కార్యక్రమాలను ప్రజలే రచించాలి. మేధావులు కూడా మౌనంగా ఉండరాదు. రాజ్యాంగ పరిరక్షణతో పాలకుల అవినీతి, అక్రమాలపై మేధావులు గొంతెత్తాలి. నిరంతరం ప్రజలను జాగరూకత పర్చాలి. సెమినార్లు నిర్వహించాలి. చర్చాగోష్టులు చేయాలి. పాలకుల అవినీతి, అక్రమాలపై గొంతెత్తి నిలదీయాలి. అప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం బలపడగలదు.

# భగవద్గీతపై నిరంతర ప్రచారం

### గంగాధర శాస్త్రికి 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' అవార్డు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి28 : ప్రసిద్ధ గాయకులు, భగవద్గీతా గాన, ప్రవచన, ప్రచార కర్త, 'భగవద్గీతా ఫౌండేషన్' వ్యవస్థాపకులు ఎల్ వి గంగాధర శాస్త్రికి భారత దేశపు ప్రతిష్ఠాత్మక 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' అవార్డు లభించింది. 2023 సంవత్సరానికి గాను, ఇతర ప్రధాన సంప్రదాయ సంగీత విభాగంలో ఆయనకు ఈ 'అకాడమీ పురస్కారం' లభించింది. తాను అభ్యసించిన కర్ణాటక శాస్త్రీయ సంగీతంతో, భారత దేశపు ఆధ్యాత్మిక సారమైన భగవద్గీత లోని 700 శ్లోకాలలో ఘంటసాల స్వరపరచి పాడిన 108 శ్లోకాలను ఆయన గౌరవార్థం యథాతథంగా పాడడంతో పాటు, మిగిలిన 594 శ్లోకాలను స్వీయ సంగీతంలో, తెలుగు తాత్పర్య సహితంగా గానం చేసి, అత్యున్నత సాంకేతిక విలువలతో రికార్డు చేసి, 'భారతీయ గాయకుడి తొలి సంగీత భరిత సంపూర్ణ భగవద్గీత' గా శ్రీ శ్రీ శ్రీ విశ్వేశ తీర్థ స్వామి, డాఎ ఏ పి జె అబ్దుల్ కలాం చేతులమీదుగా విడుదల చేసి, అంతటి తో తన బాధ్యత తీరిపోయిందని భావించకుండా, స్వార్థ రహిత ఉత్తమ సమాజ నిర్మాణం కోసం గీతా ప్రచారానికే తన జీవితాన్ని అంకితం చేసినందుకు గంగాధర శాస్త్రి కి ఈ అవార్డు దక్కింది. ఈ మహత్కార్యం చేసినందుకు గతంలో గంగాధర శాస్త్రిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళారత్న' (హంస) పురస్కారంతోను, మధ్యప్రదేశ్ లోని 'మహర్షి పాణిని యూనివర్సిటీ' 'గౌరవ డాక్టరేట్' తోను సత్కరించింది. కాగా ఇప్పుడీ అవార్డు ప్రకటించిన నేపథ్యంలో, 'గీత' పట్ల తన అంకిత భావాన్ని గత 16 సంవత్సరాలుగా గుర్తిస్తూ వచ్చిన కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖామంత్రి జి. కిషన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, అలాగే సంగీత నాటక అకాడమీ చైర్మన్ సంధ్య పురేచకు, జ్యూరీ సభ్యులకు, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖకు గంగాధర శాస్త్రి కృతజ్ఞతలు తెలియజేసారు. ఇది తనకు తొలి జాతీయ అవార్డు అన్నారు. ఈ అవార్డు, పాట నేర్పిన తన తల్లి తండ్రులకు, 'గీతా గాన మార్గదర్శి' ఘంటసాలకు, గీతా సద్గురువులకు, శాస్త్రీయ సంగీతం నేర్పిన గురువులకు అంకితమన్నారు. 'భగవద్గీత' అంటే భారతదేశపు ఆలోచనా విధానమని, ఇది మతాలకు అతీతమైన, సర్వజనామోద యోగ్యమైన, ఆచరణీయమైన, అత్యుత్తమమైన కర్తవ్య బోధ అనీ, దీనిని ప్రతి ఒక్కరూ చదివి, అర్థం చేసుకుని, ఆచరించడం ద్వారా స్వార్థరహిత ఉత్తమ సమాజాన్ని ఏర్పరచవచ్చని, అందుకే తమ 'భగవద్గీతా ఫౌండేషన్' ద్వారా గీతా ప్రచారం కోసమే తన జీవితాన్ని అంకితం చేశానని గంగాధర శాస్త్రి అన్నారు. భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించడం ద్వారా ఈ దేశపు జ్ఞాన సంపదను గౌరవించాలని భారత ప్రభుత్వాన్ని, రాష్ట్ర ప్రభుత్వాలనూ కోరుతున్నామని, గీతను పాఠ్యాంశంగా చేర్చి బాల్య దశ నుంచే పిల్లలకు నేర్పించడం ద్వారా, మానవీయ విలువలను పెంపొందించవచ్చని ఆయన అన్నారు. ఇప్పటికే అయోధ్యలో రామాలయ నిర్మాణం ద్వారా భారతీయుల ఆత్మ గౌరవాన్ని కాపాడినందుకు, పాఠ్య పుస్తకాల్లో మన దేశం పేరుని భారత్ గా మార్పుచేసి చరిత్ర ను కాపాడినందుకు కేంద్ర ప్రభుత్వానికి నమస్సులతో కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు.

# కాంగ్రెస్ హాట్ సీటుగా ఖమ్మం

- అందరి కన్నూ ఈ సీటుపైనే
- వీహెచ్, కుసుమ కుమార్‌ల దృష్టి
- ముగ్గురు మంత్రుల కుటుంబసభ్యుల కర్చీఫ్
- తమకే కేటాయించాలంటున్న సీపీఐ



ఖమ్మం,ఫిబ్రవరి28 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశావహులకు ఖమ్మం సీటు హాట్ కేక్‌లా మారింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడంతో కాంగ్రెస్ పార్టీకి ఇది గ్యారెంటీగా మారింది. దీంతో అందరి కన్నూ ఖమ్మంపై పడింది. కాటికి కాళ్లు చాపుకున్న వారు కూడా మేము సైతం అంటున్నారు. ఇక్కడ ప్రధాన పోటీదారుగా ఉన్న మాజీమంత్రి రేణుకాచౌదరి రాజ్యసభకు వెళ్లడంతో మరికొందరికి ఇప్పుడు ఈ సీటుపై కన్నుపడింది. అయితే అదిష్టానం ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుందన్నది పక్కన పెడితే ఎవరికి వారు తామే అర్హులమని కాంగ్రెస్‌లో ప్రచారం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా సీనియర్ నేత విహెచ్ కూడా ముందు వరసలోకి వచ్చారు. నాకు అన్యాయం జరిగింది కనుక ఖమ్మం సీటు ఇవ్వాలన్నది ఆన అభిమతంగా ఉంది. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరి స్తున్న ముగ్గురు మంత్రుల కుటుంబసభ్యులు టికెట్ రేసులో ఉండగా, ఇప్పుడు మరికొన్ని కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. తమకంటే తమకే అవకాశం కల్పించాలంటూ పార్టీ సీనియర్లు బహిరంగంగా కోరుతున్నారు. ఇలా ఖమ్మం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న డజన్ మంది లీడర్లు ఎవరి ప్రయత్నాల్లో వారుంటే, పొత్తుల్లో భాగంగా ఈ సీటును తమకు కేటాయించాలని సీపీఐ పట్టుబడుతుండడం ఆసక్తి రేపుతోంది. మొత్తంగా ఖమ్మం పార్లమెంట్ కోసం కాంగ్రెస్‌లో పోటీ ఎక్కువయ్యింది. తొలుత ఇక్కడి నుంచి సోనియాను బరిలోకి దింపాలని రాష్ట్ర కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ మేరకు తీర్మానం కూడా చేసింది. అయితే అనూహ్యంగా సోనియా రాజ్యసబకు వెళ్లి పోయారు. కనుక ఆమె ఇక పోటీచేసే అవకాశం లేదు. ఒకవేళ ప్రియాంక ఓకే చెబితే ఇక పోటీ అన్నది ఉండదు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ రాజకీయాల్లో ఉంటూ, సోనియా కుటుంబానికి వీరవిధేయుడిగా చెప్పుకునే వీహెచ్ కూడా ఖమ్మం సీటు కోసం పట్టుపడ్తున్నారు. తనకంటే అర్హతలెవరికి ఉన్నాయో చెప్పాలని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇక కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్ కూడా తాజాగా రేసులోకి వచ్చారు. హైదరాబాద్ సెంట్రిక్ గా పాలిటిక్స్ చేసే ఆయన, ఇటీవల ఖమ్మం డీసీసీ ఆఫీసులో ప్రెస్ మీట్ పెట్టి మరీ ఖమ్మం పార్లమెంట్ టికెట్ తనకివ్వాలని హైకమాండ్‌ను కోరారు. ఇక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భార్య నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్‌తో పాటు వ్యాపారవేత్త వీవీసీ రాజేంద్రప్రసాద్ కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. మాజీ కేంద్రమంత్రి రేణుకాచౌదరికి కాంగ్రెస్ ఇటీవల రాజ్యసభ సీటు కేటాయించడంతో ఆమె పోటీ నుంచి తప్పుకున్నారు. లేదంటే ఆమో కూడా రేసులో ఉండేవారే! మరోవైపు కామ్రేడ్లు కూడా ఖమ్మం సీటుపై కన్నేశారు. అసెంబ్లీ ఎన్నికల టైంలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకొని, ఒక్క అసెంబ్లీ సీటుతో సరిపెట్టుకున్న సీపీఐ, ఇప్పుడు తమకొక పార్లమెంట్ సీటు కేటాయించాలనే డిమాండ్ పెట్టింది. రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్‌తో చర్చలు జరిపినప్పటికీ పొత్తులు, సీట్ల సర్దుబాటుపై నిర్ణయం హైకమాండ్‌దేనని ఇక్కడి లీడర్లు స్పష్టం చేయడంతో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో సీపీఐ జాతీయ నేతలు చర్చించినట్టు సమాచారం. రాష్ట్రంలో తమకు పట్టున్న ఐదు ఆప్షన్లను కామ్రేడ్లు ముందుకు తెస్తున్నారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ, భువనగిరి, పెద్దపల్లి స్థానాల్లో ఏదో ఒకటి కేటాయించాలని కోరుతున్నారు. ఇటీవల కొత్తగూడెం అసెంబ్లీ సీటును గెల్చుకోవడంతో పాటు సంస్థాగతం గా బలంగా ఉన్న ఖమ్మం పార్లమెంట్? స్థానం వైపే సీపీఐ మొగ్గుచూపుతోంది. 2014 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌తో సీపీఐ పొత్తు పెట్టుకోగా, ఖమ్మం సీటును సీపీఐకి ఇచ్చారు. ఆ పార్టీకి అప్పుడు రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కె.నారాయణ ఖమ్మం లోక్‌సభ సెగ్మెంట్ నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. మళ్లీ ఇప్పుడు తమకే కేటాయించాలని సీపీఐ కోరుతోంది. 2014 ఎన్నికల్లో వైసీపీకి సీపీఎం మద్దతివ్వగా, అప్పుడు వైసీపీ తరపున పోటీ చేసిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గెలిచారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్‌లో ఉండగా, సొంత తమ్ముడు ప్రసాద్ రెడ్డికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. మొత్తంగా ఇప్పుడు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

# ఈడీ ముందు హాజరుకావాల్సిందే

- ఈడీ సమన్లకు వ్యక్తులు తప్పనిసరిగా హాజరుకావాలి
- సుప్రీం కీలక ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి28 : మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద సమన్లు పొందిన వ్యక్తులు కొనసాగుతున్న దర్యాప్తుకు సహకరించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు హాజరుకావాల్సిందేనని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. తమిళనాడు ప్రభుత్వం రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలపై ఆరోపణలను ఎదుర్కొంటున్న కలెక్టర్లను ఈడీ నుంచి కాపాడటానికి చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులను సస్పెండ్ చేసిన సుప్రీంకోర్టు.. "సమన్‌లను గౌరవించడం, ప్రతిస్పందించడం అవసరం" అని పేర్కొంది. అక్రమ ఇసుక తవ్వకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న కలెక్టర్లను విచారణ చేయకుండా ఈడీని నిషేధించింది మద్రాస్ హైకోర్టు. దీంతో ఆ ఉత్తర్వులను తోసిపుచ్చిన అత్యున్నత న్యాయస్థానం కలెక్టర్లుఈడీ నిర్దేశించిన తేదీలలో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. "పీఎంఎల్ఎలోని సెక్షన్ 50 కింద ఈడీ సమన్లు జారీ చేసింది. చట్టం, ఈడీ విచారణ లేదా విచారణ సమయంలో వారి హాజరు అవసరమని భావిస్తే, సంబంధిత అధికారి ఎవరైనా..ఆ వ్యక్తిని పిలిపించే అధికారం ఉందని స్పష్టంగా తెలియజేస్తుంది. జిల్లా కలెక్టర్లు, సమన్లు జారీ చేయబడిన వ్యక్తులు ఈ సమన్‌లను గౌరవించడం, వాటికి ప్రతిస్పందించడం తప్పనిసరి" అని న్యాయమూర్తులు బేలా ఎం త్రివేది, పంకజ్ మిథాల్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఈడి వంటి ఫెడరల్ ఏజెన్సీల సహాయంతో రాజకీయ ప్రత్యర్థులను కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని ప్రతిపక్ష రాజకీయ పార్టీల నేతృత్వంలోని రాష్ట్రాలు ఆరోపిస్తున్న తరుణంలో కోర్టు ఈ ఆదేశం ఇవ్వడం గమనార్హం. సోమవారం, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021-22లో అవకతవకలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించడానికి ఏడవ సారి ఈడీ సమన్లను దాటవేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఒక ప్రకటనలో, ఈ విషయం సబ్ జుడీస్ అయినందున కేజ్రీవాల్ ఈడీ ముందు హాజరుకావడం లేదని పేర్కొంది. సమన్లను ధిక్కరించినందుకు కేజ్రీవాల్‌పై ఈడీ ఢిల్లీ కోర్టులో ఫిర్యాదు చేసింది. కేసు విచారణ జరిగే మార్చి 16 వరకు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాకుండా కేజ్రీవాల్‌కు కోర్టు మినహాయింపు ఇచ్చింది.

# ఆనాడు మేడిగడ్డకు రానన్నారు కదా

### ఇప్పడెందుకు మేడిగడ్డకు వెళుతున్నారు
### బొందలగడ్డతో పోల్చింది మీ నాయనే కదా
### కెటిఆర్‌కు జగ్గారెడ్డి చురకలు



హైదరాబాద్,ఫిబ్రవరి28 : ఆనాడు మేడిగడ్డకు రాన్న వారు ఇప్పుడు ఎందుకు వెళుతున్నారని బిఆర్ఎస్ నేతలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి నిలదీసారు. మేడిగడ్డనా? బొందలగడ్డనా? ఏం పీకడానికి మేడి గడ్డకు పోతున్నారు' అని కేసీఆర్ మాట్లాడారని.. గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ' ముఖ్యమంత్రిగా పని చేసిన ఓ వ్యక్తి అలాంటి మాటలు మాట్లాడటం సమంజసమేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 70 ఏళ్ల కేసీఆర్‌కే అంత కోసం వస్తే.. యంగ్ డైనమిక్ సీఎం రేవంత్ రెడ్డికి, భట్టి విక్రమార్కకు ఆవేశం రాదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన అవినీతిని బయటపెట్టడానికే తాము మేడిగడ్డకు వెళ్లామని ఉద్ఘాటించారు. కేటీఆర్ మీ నాన్నకు అలా మాట్లాడ కూడదని బుద్ధి చెప్పు' అని జగ్గారెడ్డి సూచించారు. అలాగే.. మేడిగడ్డని బొందలగడ్డతో పోల్చకూడదని మీ మేనమామ అయిన కేసీఆర్‌కు చెప్పు అని హరీష్ రావుకి చెప్పారు. మేడిగడ్డను బొందలగడ్డతో పోల్చిన కేసీఆర్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణలు చెప్పేదాకా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను వదిలేదే లేదన్నారు. ప్రభుత్వం మేడిగడ్డకు రమ్మన్నప్పుడు కేసీఆర్ ఎందుకు రాలేదన్న ఆయన.. ఇప్పుడు మీరు రమ్మంటే మేమెందుకు వస్తాం? అని కౌంటర్ ఇచ్చారు. కడియం శ్రీహరి గురించి మాట్లాడి టైం వృద్ధా అని, బాల్క సుమన్ ఒక బచ్చా అని సెటైర్లు వేశారు. ఇక ఈ ప్రపంచంలో ప్రజలెవ్వరూ దేవుడిని మొక్కడం లేదు, మేము మాత్రమే మొక్కుతున్నాం అన్నట్లుగా ఉంది బండి సంజయ్ (ఃజీనిటతి ఈూజీనితీజా) వ్యవహారమని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. శ్రీరాముడు బీజేపీలో కొంతమందికే దేవుడా? అని ప్రశ్నించారు. శ్రీ రాముడు తన తల్లిని గౌరవించే మహానుభావుడని, తల్లి మాటలు కాదనకుండా వనవాసానికి పోయిన గొప్ప వ్యక్తి అని చెప్పారు. కానీ.. బండి సంజయ్‌లో రాముడి విలువలు ఏమాత్రం లేవని తూర్పారపట్టారు. పొన్నన్ ప్రభాకర్ తల్లిపై కామెంట్ చేసి.. శ్రీరాముడికున్న విలువల్ని బండి సంజయ్ తగ్గించారని విమర్శించారు. బేషరతుగా పొన్నం ప్రభాకర్‌కు క్షమాపణలు చెప్పాలన్నారు. మీ అమ్మను ఒక మాట అంటే.. నీకు కోపం రాదా బండి సంజయ్? అని అడిగారు. ఓట్ల కోసమే రాముడిని వాడుకుంటున్నారని, రాముడికున్న గొప్ప చరిత్రను దిగజారుస్తున్నారని మండిపడ్డారు.

# ఇండియా కూటమి బలపడుతుంది

### బిజెపికి ఇక నూకలు చెల్లినట్లే
### ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన మోడీ
### కాంగ్రెస్ నేత మల్లు రవి



హైదరాబాద్,ఫిబ్రవరి28 : కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా మిషన్ మొదలయ్యిందని...ఇక బిజెపి ఆటలు సాగవని కాంగ్రెస్ సీనియన్ నేత మల్లు రవి అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న మోడీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఎంతో దూరం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు. బిజెపి దేశానికే కాదు... రాష్ట్రాలకు కూడా ఏమీ చేయలేదని ప్రజలు కూడా గుర్తించారని అన్నారు. అలాంటి బిజెపిని ఎంత త్వరగా సాగనంపితే అంతమంచిదని అన్నారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం గతంలో ఎప్పుడూ ఇంతగా జరగలేదన్నారు. తమ స్వార్థం కోసం బిజెపి ఎంతటి చర్యలకైనా దిగుతోందన్నారు. విపక్షాలు లక్ష్యంగా చేస్తున్న ఈ చర్యలను ప్రజలు గమనించారని అన్నారు. ప్రజలు అంత అమాయకులు కాదుకదా అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళారీలను బాగు చేయడం మినహా ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. ప్రజల కోసం చేసిన ఒక్క మంచి పథకం ఏదో చెప్పాలని బీజేపీకి సవాల్ విసిరారు. ఆదానీ, అంబానీలకు దోచిపెడుతున్న తీరు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారిందన్నారు. ఢిల్లీలోని బీజేపీ సర్కారును గద్దె దింపే కార్యక్రమం మొదలైందని మల్లురవి వ్యాఖ్యానించారు. ఇండియా కూటమికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ కుట్రలు పన్నుతున్నదని మండిపడ్డారు. అన్ని పార్టీలు కలసి ముందుకు వస్తున్నాయని, విభేదాల సృష్టించి పబ్బం గడుపుకోవాలని బిజెపి ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. బిజెపి పునాదులు కదులుతున్నాయని అన్నారు.అభివృద్ధికి సహకారం అందించవలసిందిగా కేంద్రంలోని బీజేపీని రాష్ట్రాలు అభ్యర్థిస్తున్నా పట్టింపు లేదు. జీఎస్టీ భారాలను పట్టించుకోవడం లేదు. అలాగే బిజెపికి రాష్ట్రాలను అభివృద్ధి చేయాలన్న కాంక్ష లేదన్నారు. ఈ నేపథ్యంలో తాము మొదలెట్టిన ప్రత్యామ్నాయ ప్రయత్నం విజయవంతం అవుతుందన్నారు. రాహుల్ నాయకత్వంలో ప్రత్యామ్నాయ వేదిక అయిన ఇండియా కూటమిని ఏర్పాటు చేసి మోడీని గద్దె దించేందుకు సమరశంఖం పూరించామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా గొంతు కలుపుతున్న అన్ని రాష్ట్రాలు కూడా ఇప్పుడు ఏకం అయ్యాయని అన్నారు. నరేంద్ర మోదీ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించడానికి అందరూ అర్హులేనని ఇతరులకు అభ్యంతరాలు లేవని అన్నారు. బీజేపీనే మళ్లీ అధికారం లోకి వస్తే పరిస్థితి ఏమిటన్నదే ఇప్పుడు అందరిలోనూ చర్చగా మారిందన్నారు. బిజెపికి అంత సీన్ లేదని రానున్న రోజుల్లో మరింత స్పష్టత రాగలదని కాంగ్రెస్ నేత అన్నారు. అందుకే ఇప్పుడు ప్రతి ఒక్కరూ కూటమి వైపు చూస్తున్నారని అన్నారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు అందాలన్నది తమ ఆకాంక్ష అని తెలిపారు.

# దేశం దీర్ఘకాలిక ప్రయోజనాలే బీజేపీ లక్ష్యం

### కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి28: దేశం దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం కట్టుబడి ప్రణాళికలు రూపొందించడం మా ప్రభుత్వం లక్ష్యం.. దేశ నిర్మాణం ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యం.. బీజేపీ.. నాన్ బీజేపీ ప్రభుత్వాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలి అని సూచించారు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. విశాఖలో క్లస్టర్ ప్రవాస్ యోజనలో భాగంగా జరిగిన మేధావుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ద్రవ్య లోటుతో ప్రపంచంలో అనేక దేశాలు అతలాకుతలం అవుతుంటే కరెంట్ డెఫ్ షీట్ లేని దేశంగా భారత్ అవిర్భవించింది.. ఖతార్ లో గూఢచర్యం కేసులో చిక్కుకుని శిక్ష అనుభవిస్తున్న భారత మాజీ నేవీ అధికారులను సురక్షితంగా స్వదేశానికి రప్పించిన దౌత్య నీతి.. ప్రధాని కారణంగా సాధ్యం అయ్యిందన్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకున్న వేలాది మంది విద్యార్థులను స్వదేశానికి తెచ్చిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు.కేవలం రాజకీయాల కోసమే భారతీయ జనతాపార్టీ లేదు, దేశాన్ని ప్రపంచ అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తోందన్నారు రాజ్‌నాథ్.. ట్రిపుల్ తలాక్, సివిల్ కామన్ కోడ్, అయోధ్య రామాలయం, ఆర్టికల్ 377 ద్వారా కాశ్మీర్ లో స్వేచ్ఛా వాయువులు లాంటి సాహసోపేత నిర్ణయాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఇక, 2027 నాటికి ప్రపంచంలోనే భారత్ మూడో ఆర్థిక శక్తిగా నిలబడడంలో ఎలాంటి సందేహం లేదన్న ఆయన.. 2047 నాటికి ప్రపంచ ఆర్థిక శక్తిగా అవతరించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం అన్నారు. UPI లావాదేవీల్లో భారత్ ప్రపంచంలో నెంబర్ 1గా ఉంది.. ఎన్నికలు, ప్రభుత్వం ఏర్పాటు కోసం పని చేస్తున్న ప్రభుత్వం బీజేపేది.. రాబోయే ఐదు-ఏడేళ్ల కాలంలో ప్రతీ జిల్లాకుఒక మెడికల్ కాలేజ్ ఏర్పాటు కాబోతున్నాయన్నారు.

# మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో

## విజయవంతంగా నిర్వహించాలి

## ఎంపీపీ బి. రాణి బాయి

**మహాదేవపూర్ (ప్రజామంటలు):**



మహాదేవపూర్ మండలంలో మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమ ఏర్పాట్లపై బుధవారం మండల పరిషత్ సమావేశపు మందిరంలో వైద్య విద్యా సంక్షేమశాఖలు గ్రామీణాభివృద్ధి అనుబంధ శాఖల అధికారులతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుస్మిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాణి బాయి మాట్లాడుతూ... మండలంలో 2144 మంది 0–5 సంవత్సరాల లోపు చిన్నారులను గుర్తించడం జరిగిందని చెప్పారు. మార్చి 3 4, 5 తేదీలలో వీరందరికి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల (సబ్ సెంటర్లు) పరిధిలోను రూరల్ ప్రాంతాల్లో ట్రైబల్ ప్రాంతాల్లో ప్రత్యేక పోలియో కేంద్రాలు మొబైల్ పాయింట్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వీటితో పాటు బస్‌స్టాండ్ కాళేశ్వరం ఆలయం వద్ద జనసమూహాలతో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ప్రత్యేక శిభిరాలు ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికి పోలియో చుక్కలు వేయనున్నట్లు ఎంపీపీ ప్రకటించారు మార్చి 3 వ తేదీన జరిగే ఇమ్యూన్కెజేషన్ కార్యక్రమంలో ఏదేని కారణాలతో మిగిలిపోయిన చిన్నారులకు మరుసటి రోజు ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలను వేయనున్నట్లు ఎంపీపీ బి. రాణి బాయి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ వెంకటేశ్వర్లు డాక్టర్ సుస్మిత అంగన్ వాడీ సూపర్ వైజర్లు పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు

# ఉత్తర్వులు ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

## బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి



మహాదేవపూర్ ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాద రావు జయంతి వేడుకలు అధికారికంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి శనివారం ఉత్తర్వులు జారీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి వర్గానికి మహాదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు తెలంగాణ ప్రభుత్వం మార్చి 2న మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాద రావు జయంతి పురస్కరించుకొని స్టేట్ ఫంక్షన్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం పట్ల మహాదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మంథని శాసనసభ్యులుగా మూడుసార్లు గెలిచిన దుద్దిళ్ళ శ్రీపాద రావు స్పీకర్ గా పని చేశారు.కాటారం మండలం దన్వాడ గ్రామంలో జన్మించిన శ్రీపాద రావు సర్పంచ్ గా, ఎల్‌ఎంబి బ్యాంక్ చైర్మన్ గా బాధ్యతలు చెప్పటారు.1983 నుండి వరుసగా మూడు సార్లు మంథని ఎమ్మెల్యే గా గెలిచారు.1999 ఏప్రిల్ 13న మహాదేవపూర్ మండలం అన్నారం అడవుల్లో అప్పటి పీపుల్స్ వార్ నక్సలైట్లు హత్య చేశారు.అజాత శత్రువుగా పేరొందిన శ్రీపాద రావు ను బుచ్చి పంతులు అని పిలిచేవారు.ఆయన మరణంతరం వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన దుద్దిల్ల శ్రీధర్ బాబు మంథని నుండి ఐదు సార్లు ఎమ్మెల్యే గా గెలిచారు. ప్రస్తుతం ఆయన ఐటి, పరిశ్రమల శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో కీలక పాత్ర పోషస్తున్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీపాద రావు జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మంథని నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలు, దుద్దిళ్ళ కుటుంబం యొక్క అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని భాస్కర వెంకటరమణ పత్రిక ప్రకటనలో తెలిపారు.

## జగిత్యాల రూరల్ ఎంపిపిగా మంగళారపు మహేష్

**జగిత్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):**



జగిత్యాల రూరల్ మండల ఎంపీపీగా ఎన్నికైన మంగళారపు మహేష్, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ లను, జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసారు. కొత్తగా ఎంపికైన ఎంపీపీ ని సన్మానించి,ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్ లు శుభాకాంక్షలు తెలియజేసారు. పాక్స్ చైర్మన్ లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, ఎంపీటీసీలు ఆరే సౌజన్య తిరుపతి, లక్ష్మి శంకర్, సురేందర్ రెడ్డి,రెడ్డి రత్న రవి, స్వప్న శ్రీనివాస్, బూపెల్లి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు జావేద్,నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు..

## వెండి పతకం తో సత్తా చాటిన సోషల్ వెల్ఫేర్ విద్యార్థి

**కోరుట్ల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):**



జారండ్ లో జరిగిన 67వ నేషనల్ స్కూల్ కోకో క్రీడా పోటీలలో కోరుట్ల పట్టణలో గల సోషల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల లో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థి గుగులోతు వినాయక్ వెండి పథకం సాధించినట్లు సోషల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ బాబు పత్రిక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంక్షేమ గురుకులాలు విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చి దిద్దుతూ వారి అభివృద్ధికి పాటు పడుతున్నాయని అదేవిధంగా క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాలని వారికి విద్యతో పాటు ఆటలలో శిక్షణ ఇస్తున్నామని మా విద్యార్థి కోకోలో పథకం సాధించడం సంతోషంగా ఉందని ఈ ఉత్సాహంతో ముమ్ముందు కూడా విద్యార్థులు క్రీడలలో రాణించేల కృషి చేస్తామని విద్యార్థిని అభినందిస్తు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, పీఈటీ లు అజయ్, ప్రణయ్ మరియు ఉపాధ్యాయులు అంకం సురేష్ లు పాల్గొని అభినందించారు.

## ట్రాక్టర్ ట్రాలీ పడి మహిళ దుర్మరణం

**కథలాపూర్ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):**



జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం చింతకుంట గ్రామ శివారులో ట్రాక్టర్ ట్రాలీ పడి, అదే గ్రామానికి చెందిన వేముల పోశవ్వ (52) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామములో విశాద ఛాయాలు నెలకొన్నాయి .. పోశవ్వ అనే గ్రామస్తురాలు సోమవారం నాడు ట్రాక్టర్లో లో మట్టి నింపే పనికి వెళ్లింది.సాయంత్రం ట్రాక్టర్ వెనక టైరు వద్ద మట్టిని తవ్వి నింపుతుండగా డ్రైవర్ రాము అజాగ్రత్తగా వ్యవహరించి ట్రాక్టర్ ను ముందుకు పోనిచ్చాడు. దీంతో ట్రాలీతోపాటు మట్టి పోశవ్వపై పడి ఆమే స్పృహతప్పి పడిపోవడంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. మృతురాలి భర్త గంగరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

## సుఖస్థల్ క్షేత్రంలో నంబి వేణుగోపాలాచార్య కౌశిక చే

### మార్చి 4 వరకు 53వ భాగవత సప్తాహ ప్రవచనం

**సుఖస్థల్ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):**



జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన నంబి వేణుగోపాల ఆచార్య కౌశిక ఉత్తరప్రదేశ్ లోని సుఖస్థల్ క్షేత్రంలో సుఖదేవ్ ఆశ్రమంలో 27 ఫిబ్రవరి 2024 మంగళవారం 53వ శ్రీమద్ భాగవత సప్తాహ ప్రవచనం ప్రారంభమైంది .ఈ కార్యక్రమం మార్చి 4వ తేదీ సోమవారం వరకు కొనసాగును. కార్యక్రమానికి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి సప్తాహం ప్రారంభించారు. ఉదయం 9 గం నుండి మధ్యాహ్నం 12గం వరకు సప్తాహ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

**కొడిమ్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):**



కొడిమ్యాల మండల కేంద్రంలోని విజ్ డమ్ విద్యా భారతి విద్యాసంస్థలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విజ్ డమ్ విద్యా భారతి విద్యాసంస్థలలో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల సైన్స్ ప్రదర్శనలు మరియు వారు తయారు చేసిన వాటి గురించి విద్యార్థినీ విద్యార్థులకు వివరించి చెప్పారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆహుతులను వీరు తయారు చేసిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల టాక్సీ ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగిత్యాల పట్టణానికి చెందిన మోయిజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ని కలువగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. వెంట కౌన్సిలర్ ఆవారి శివకేసరి బాబు, కోరే గంగమల్లు, బొడ్ల జగదీష్, పార్టీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు గట్టు సతీష్, వోల్లెం మల్లేశం, నాయకులు పోతున్క మహేష్ లు వున్నారు.

## ఘనంగా టైలర్స్ డే వేడుకలు

**కొడిమ్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోటైలర్స్ డే ను పురస్కరించుకొని మేరు సంఘం అధ్వర్యంలో మేరు కుల దైవం జడగిరి శంకరదాసమయ్యకు పూజ కార్యక్రమము నిర్వహించి, సంఘ సభ్యుల అధ్వర్యంలో కేక్ కట్ చేసినారు. ఇట్టి కార్యక్రమంలో అధ్యక్షులు దీకొండ గంగాధర్, ఉపాధ్యక్షులు ,సోమ నర్సయ్య సంఘ సభ్యులు దీకొండ గంగాధర్, రామగిరి నారాయణ, దీకొండ గంగారం, దీకొండ గంగాధర్ , రాపర్తినర్సింగరావు, రాపర్తి జనార్ధన్ , దీకొండ స్వామి, సోమ వెంకటి, సోమ దేవదాస్, దీకొండ చంద్ర శేఖర్, దీకొండ అశోక్, దీకొండ శ్రీనివాస్, దీకొండ వెంకట రమణ, రాపర్తి నవీన్, దీకొండ సంతోష్ , మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసంలో నూతన మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

**జగిత్యాలఫిబ్రవరి 28 (ప్రజామంటలు):**



ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసంలో మాజీ మున్సిపల్ చేర్మెన్స్ గిరి నాగభూషణం, తాటిపర్తి విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డి లను, కాంగ్రెస్ నాయకులు తాటిపర్తి రాంచంద్ర రెడ్డిని కొత్తగా ఎన్నికైన మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ కలిశారు. మున్సిపల్ చేర్మెన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్నికలో పాల్గొని ఓటు వేసిన వారి అందరికి నా ధన్యవాదాలు. పార్టీలకు అతీతంగా అందరు నాకు ఓటు వేశారు. అందరికీ కృతజ్ఞతలు పార్టీలకు అతీతంగా అందరిని కలుపుకొని ముందుకు వెళ్తాను. ఉన్న కొద్దీ సమయంలో అభివృద్ధిలో ముందు నిలపడతానని తెలిపారు. భారత రాజ్యాంగ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం జగిత్యాల మున్సిపల్ చైర్మన్ బీసీ మహిళ కేటాయించడం వల్ల ఆ సీటు కొరకు పెద్దలు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొన్నారని అన్నారు.బీసీల అభ్యున్నతి కొరకు బీసీలకు కేటాయించిన స్థానంలో బీసీలే ఉండాలని, దానిలో భాగంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలపడానికి జీవనన్న నివాసానికి వచ్చానని అన్నారు. ఈ అవకాశం కలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నాయకులు ఆమెను పూలమాల శాలువలతో సన్మానించారు.

## ఘనంగా టైలర్స్ డే

**రాయికల్ ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):**


రాయికల్ మేరు సంఘంలో టైలర్స్ డే ను బుధవారం ఘనంగా నిర్వహించారు. కులదైవ%శీ% శ్రీ శంకరదాశమయ్య పూజలు నిర్వహించారు. సంఘ అభివృద్ధి కి అందరు సంహరించి, ఐకృకంగా ఉండాలని కృషి చేయాలనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సింగు వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి కొట్టూరి రమేష్, సింగు నరేందర్, శాంతయ్య, పెద్ద నర్సయ్య, సుదర్శన్, శివ, గంగా నర్సయ్య, సభ్యులు పాల్గొన్నారు.




## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంకు 25,116 విరాళం

### అందజేసిన దాతలు జగడి దేవరెడ్డి-సరోజన

**కొడిమ్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):**



కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ మునకు కొడిమ్యాల వాస్తవ్యులు జగడి దేవరెడ్డి-సరోజన ల కుటుంబం ఆలయనికి "శాశ్వత చందా దారులు"గా 25,116 రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు అంద జేశారు. ఆలయానికి ధన రూపేనా సహకరించిన దాతలకు అర్చకులు నాగరాజు రమేష్ స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేసి మంగళ శాసనములతో ఆశీర్వదించారు. ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి సహకరించిన దాతల కుటుంబానికి నిర్మాణ కమిటీ తరఫున, భక్తుల తరఫున, గ్రామస్తుల తరఫున ప్రత్యేక ధన్యవాదములు.

## సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళాబృందం ద్వారా ప్రజలకు అవగాహన



**మెడిపెల్లి ఫిబ్రవరి 28 ( ప్రజామంటలు):**

జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మేడిపల్లిపోలీస్ స్టేషన్ పరిధిలోని తోబాద్రావు పేట గ్రామంలో పోలీస్ కళాబృందం వారు మూఢ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు మరియు ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ ల మోసాలు, సైబర్ మోసాలు,నివారణ పై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమం భాగంగా ఎస్సై శ్యామ్ రాజ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో అన్నిహాగ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడంజరుగుతుంది. దీని వల్ల గ్రామంలోఏ సంఘటన జరిగిన వెంటనేతెలుస్తోంది అని తెలిపారు, సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించలని గ్రామస్థులను కోరారు.తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని, ప్రభుత్వం, పోలీస్ తరపున అన్ని విధాల సహాయహకారులు ఉంటాయని అన్నారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని,లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్శ్యకత గురించి వివరించారు. గ్రామాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు వున్న పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని తెలిపారు. గ్రామంలోహాచిన్న చిన్న తగాదాలకు పోయి జీవితం నాశనము చేసుకొవద్దని, నేరరహిత గ్రామాలుగ చేయడానికి ప్రజలు కృషి చేయాలనీ సూచించారు. మంత్రాలు తత్రాలు ముడనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమ్యస వున్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలుపాలన్నారు,లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్యామ్ రాజ్హా మరియుహా గ్రామ ఎంపీటీసీ,మాజీ సర్పంచ్, పోలీసు సిబ్బంది, పోలీస్ కళా బృందం సభ్యులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చివరి టెస్టులో సీనియర్ ఆటగాళ్లకు రెస్ట్!

మార్చి 7 నుంచి ధర్మశాల వేదికగా భారత్, ఇంగ్లాండ్ మధ్య చివరి టెస్టు జరగనుంది. ఇక ఈ చివరి మ్యాచ్‌లో టీమిండియా పలు మార్పులతో బరిలోకి దిగనున్నట్టు తెలుస్తోంది. రాంచీ విజయం అనంతరం పలువురు సీనియర్ ఆటగాళ్లకు రెస్ట్ ఇవ్వాలని చూస్తోంది టీమ్ మేనేజ్‌మెంట్.రాంచీలో జరిగిన నాలుగో టెస్టుకు ఫాస్ట్ బౌలర్ జస్ప్రిత్ బుమ్రాకు రెస్ట్ ఇచ్చింది టీమ్ మేనేజ్‌మెంట్. చివరి టెస్టుకు తిరిగి బరిలోకి దిగుతాడని తెలుస్తోంది. అలాగే ఆఖరి టెస్టులో బుమ్రా కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టగా.. రోహిత్ శర్మ రెస్ట్ తీసుకోనున్నాడని సమాచారం. అటు దేవదూత్ పడిక్కల్ టెస్టుల్లోకి అరంగేట్రం చేయనున్నాడు.

# కుటుంబ పాలనకు జగిత్యాల ప్రజలు చరమగీతం పాడారు

## జీవన్ రెడ్డి ఇప్పుడైనా పద్ధతి మార్చుకోవాలి

## ఎన్నికల కోసమే బిసి మంత్రం

## ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ విమర్శ

జగిత్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):



బి అర్ ఎస్ పార్టీ కౌన్సిలర్ లు 29 మందికి పార్టీ విప్ జారీ చేయగా, 9 మంది కౌన్సిలర్ లు పార్టీ కి వ్యతిరేకంగా ఓటు వేశారని, విప్ దిక్కరిస్తే కౌన్సిలర్ పదవి పోతుందని తెలిసి, జీవన్ రెడ్డి సహకారంతో, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి ద్రోహం చేశారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విమర్శించారు. జీవన్ రెడ్డి, తన అధికారాన్ని ఉపయోగించి, అధికారులపై వొత్తిడి తెచ్చి, విప్ నుండి కాపాడే ప్రయత్నం చేయవద్దు అని కోరుతున్నానీ, 2009 నుండి జీవన్ రెడ్డి అరాచక కుటుంబ పాలనను జగిత్యాల పట్టణ ప్రజలు తిరస్కరించారనీ ఆరోపించారు. ఎన్టీఆర్ ఆశీస్సులతో మంత్రి అయిన జీవన్ .. ఎన్టీఆర్నే గద్దెదించిన చరిత్ర జీవన్ ..ఈ ప్రభుత్వం సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికలు జరపట్లేదు...గత సర్పంచుల పదవీకాలం ఎందుకు కొనసాగించలేదు...స్పెషల్ ఆఫీసర్ పాలనలో పల్లెలు గాడి తప్పాయి. బిసిలకు పదవి కోసం నా ప్రయత్నం అన్న మీరు. విప్ ధిక్కరించిన వారికి కౌన్సిలర్ పదవి నుండి తొలగిస్తారు. అలా జరగని ఎడల దానికి కారణం జీవన్ .. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రతి పక్ష ఎమ్మెల్యే లకు నిధుల విషయంలో కక్ష సాధింపు చర్యలు...గత బి అర్ ఎస్ సర్కార్ లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఏటా 3 కోట్ల నిదులు కేటాయింపు చేయటం జరిగింది. అధికార దాహంతో జీవన్ గారు పార్టీ లు మారిన అతికొద్ది మంది నాయకుల్లో మీరు ముందు వరుసలో ఉంటారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన చైర్మన్ గారికి కాంగ్రెస్ ఎలా మద్దతు ఇచ్చారనీ, కాపు గా చెప్పుకునే జీవన్ రెడ్డి కాపులకు కేటాయించిన ఛైర్మెన్ కు ఎలా ధిక్కరించారు. కాపులకు సమాధానం చెప్పాలి..కాంగ్రెస్ కౌన్సిలర్ లకు విప్ జారీ చేయక పోవడం జీవన్ రెడ్డి గారిది ఉద్దేశకపూర్వ చర్య అని విమర్శించారు.

### అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదు..

వైస్ చైర్మన్ లు గా ఉన్న ఓసి లు ఇంచార్జి మున్సిపల్ చైర్మన్ గా, ఎంపీపీ గా ఉంటే బిసి లకు అన్యాయం జరిగింది అని గొంతు చించుకున్న జీవన్ గారు జగిత్యాల, రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ లకు బిసి లను కాకుండా ఒసి లకు రిజర్వ్ చేయడం ద్వారా బిసి లకు అన్యాయం జరిగిందని బిసి లు గ్రహించాలి. తగిన బుద్ధి చెప్పాలి. ఎన్నికల కోసమే బిసి మంత్రం జపిస్తారనీ ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గట్టు సతీష్, ఉప అధ్యక్షులు ఓల్లెం మల్లేశం, మాజీ ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, సమిండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్ లు ఆవారి శివ కేసరి బాబు, కూసరి అనిల్, కూతురు రాజేష్, కోరే గంగమల్లు, బొడ్ల జగదీష్, ఎంపీటీసీ సురేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సంజయ్ గారు ప్రోటోకాల్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి

ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):



మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ ఇవ్వడం జరిగింది కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.... మంగళవారం జరిగిన జగిత్యాల్ జిల్లా సర్వసభ్య సమావేశంలో మాట్లాడిన కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ ప్రోటోకాల్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. మీ నాన్న ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నీవు చేసే కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్, చెక్కులను పంపిణీ చేసినావు మరియు సిసి రోడ్లు ప్రారంభించి కొబ్బరికాయలు కొట్టినప్పుడు నీకు ప్రోటోకాల్ కనిపించలేదా? ఇప్పుడు నీకు ప్రజలు ఇచ్చిన పదవి ఎమ్మెల్యేగా ఉండి ఇట్లా మాట్లాడడం సరి అయినది కాదు ఇకనైనా ప్రోటాకాలు మాట్లాడే అర్హత నీకు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు డు మరియు కార్యకర్తలు ఖండిస్తున్నాం. మా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అయిన జువాడి నర్సింగరావు జువ్వాడి కృష్ణారావు మా నాయకుల మీద మాట్లాడడం సరికాదు. నీవు ఆ విధంగా మాట్లాడితే గ్రామాలలో మ కార్యకర్తలు నిన్ను గ్రామాలలో తిరగనియ్యడం జరగదు. నీవు మా నాయకులు ఓడిపోయిన నాయకులు అనడం మంచిది కాదని హెచ్చరిస్తున్నాము. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దూదిదాం గంగాధర్, బీసీ సెల్ అధ్యక్షులు బూస రాజేష్ మరియు కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు లక్కిడి నర్సక్క ,బోరిగం రాజు, ఎంపీటీసీలు అక్కెనపల్లి జలస్ ,తిమ్మని రాములు, నాయకులు ఆనందు, వెంకట్ రెడ్డి ,శ్రీనివాస్ ,బండి రాజేష్ ,శంకర్ రెడ్డి , పిఎసిఎస్ మాజీ చైర్మన్ అబ్బడి రాజారెడ్డి, గూడ రాజు, ప్రశాంత్, భాస్కర్ రెడ్డి ,నాచుపల్లి రాజ్ కుమార్ ,బోళ్ల వేయనా శంకర్, జంగా విజయ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# తెల్ల రేషన్ కార్డు ఉండి అర్హులైన వారికి మార్చి 1 నుండి గృహజ్యోతి ఉచిత పథకం

## ఎస్.ఈ. విద్యుత్

జగిత్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):




నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని 18 జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు తెల్ల రేషన్ కార్డు ఉండి, అర్హులైన వారికి మార్చి ఒకటి నుండి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కు జీరో బిల్ అందిస్తామని సూపెరింటెండింగ్ ఇంజనీర్ తెలిపారు. ఎవరైతే గృహ జ్యోతి పథకం పొందడానికి ఆర్హులై ఉన్నవారు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోకుండా ఉంటె లేదా ప్రజా పాలన దరఖాస్తులో ఏవైనా వివరాలు సరైనవి లేక లబ్ది పొందక పోయిన తమ పరిధిలోని ఎంపీడీవో , మునిసిపల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నెంబర్, తెల్ల రేషన్ కార్డుతో అనుసంధానమైన ఆధార్ కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. గృహజ్యోతి పథకం అర్హత కలిగిన విద్యుత్ వినియోగదారులందరు ఆందోళన చెందనవసరం లేదని, మీరు సమర్పించిన దరఖాస్తు ధ్రువీకరించిన తర్వాత మాకు నమోదు కోసం పంపిస్తారు. అర్హత కలిగిన వారికి సవరించి జీరో బిల్ అందచేయడం జరుగుతుందని తెలిపారు. ఒక వేళ మీ దరఖాస్తు పెండింగులో ఉంటె దరఖాస్తు పరిశీలన అయ్యేంత వరకు విద్యుత్ సిబ్బంది బిల్ వసులు పై ఎలాంటి చర్యలు తీసుకోరు అని అన్నారు.

# పీచర సమ్మక్క సారలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

## జాతర హుండీ ఆదాయం రూ.1,65,924

వేలేర్ ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):



వేలేరు మండలంలోని పీచర మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీ ఆదాయాన్ని బుధవారం కమిటీ నిర్వాహకులు లెక్కించారు. జాతర కమిటీ ఛైర్మన్ కొయ్యడ మహేందర్ , కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ. 1,65,924ల ఆదాయం, 67గ్రాముల వెండి సమకూరినట్లు ఛైర్మన్ మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మహేందర్ మాట్లాడుతూ.... గతంలో కంటే ఈ సారి జాతర హుండీ ఆదాయం పెరిగినట్లు పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ దీవెనలతో జాతర విజయవంతం అయ్యిందని, జాతరను విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నాట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ వైస్ ఛైర్మన్ రవి, మాజీ సర్పంచ్ రవీందర్, కో ఆప్షన్ జానీ, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ జర్నలిస్టు ఫెడరేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక



కొడిమ్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):

బోయినపల్లి మండల కేంద్రంలో గ్రామ సీమ: ఎడిటర్ ఏక్ నాథ్ ను కొడిమ్యాల మండల గ్రామ సీమ పాత్రికేయ మిత్రులు శాలువాతో సన్మానించి కొండగట్టు ఆంజనేయస్వామి తీర్థప్రసాదం అందజేసి ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేశారు తెలంగాణ జర్నలిస్ట్ ఫెడరెషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నూతన కార్యవర్గ కమిటీ. ఏర్పాటు చేయడం తేది 28/02/2024 బుధవారం రోజున నూతన కార్యవర్గ సమావేశం బోయిన్ పెల్లి మండల కేంద్రంలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సీమ మరియు టీజేఎఫ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు దూస ఏక్ నాథ్, రాత్రికి మిత్రులందరికీ టీజేఎఫ్ బోయిన్పల్లి మండల నూతన మండల అధ్యక్షుడిగా గూడ రమేష్ రెడ్డి ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మరియు కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు, ఇట్టి కార్యక్రమంలో, జిల్లా అధ్యక్షులు బోదాసు అనిల్, మండల అధ్యక్షులు గూడ రమేష్ రెడ్డి, దూస సురేందర్, వేలుపుల అరవిం ద్. చెన్న దేవేందర్, టీజేఎఫ్ కమిటీ వివిధ పాత్రికేయ మిత్రులు హాజరయ్యారు.

# సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం

ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):



మండల కేంద్రంలో జూవ్వాడి నర్సింగరావు జువ్వడి కృష్ణారావు పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో, మంగళవారం మన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో రెండు గ్యారెంటీలు, దిగువ తరగతికి చెందిన బీద మహిళలకు మహాలక్ష్మి పథకం గ్యాస్ సిలిండర్ ధర 500 రూపాయలకు మరియు గృహలక్ష్మి పథకం కింద 200 యూనిట్లు పేదవాడి ఇంటికి ఉచిత కరెంటు పథకాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా మన గౌరవనీయులైన మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి కి మరియు మన కోరుట్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జూవ్వాడి నర్సింగరావు మరియు కృష్ణారావు వారికి ఈరోజు మండల కేంద్రంలో పాలాభిషేకం చేసిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగినది.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీలు పొనకంటి వెంకట్, అక్కెనపల్లి జలస్ ,తిమ్మని రాములు, బీసీ సెల్ అధ్యక్షులు బూస రాజేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దూదిగాం గంగాధర్ మహిళా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు లక్కిడి నర్సక్క ,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోరిగం రాజు, ఎల్లాల వెంకటరెడ్డి భాస్కర్ రెడ్డి, నాచుపల్లి రాజ్ కుమార్, బండి రాజేష్ ,ఆనంద్, శ్రీనివాసరెడ్డి ,శంకర్ రెడ్డి, గూడ రాజు, తిరుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సీ.ఏఫ్.ఐ. సెంటర్ ను ప్రారంభించిన మాజీ సర్పంచ్ విజయపురి మల్లికార్జున్



వేలేర్ ఫిబ్రవరి 28 ప్రజా మంటలు

వేలేరు మండల కేంద్రంలోని వేలేరు గ్రామానికి చెందిన పత్తిపాక ప్రదీప్ నూతన సీ.ఏఫ్.ఐ. సెంటర్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల మాజీ సర్పంచ్ విజయపురి మల్లికార్జున్ ఈరోజు వేలేరు మండల కేంద్రంలో సీ.ఏఫ్.ఐ. (ఆర్థిక అక్షరాస్యత కేంద్రం) సెంటర్ ను వేలేరు మాజీ సర్పంచ్ విజయపూరి మల్లికార్జున్ టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేలేరు ఎస్.బి.ఐ. బ్యాంక్ మేనేజర్ పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనఖీ చేసిన జిల్లా కలెక్టర్

జగిత్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు)



నేటి నుండి ప్రారంభమయిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలలో భాగంగా బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 95.5 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7270 మందికి గాను 6945 మంది పరీక్షలు హాజరయ్యారని, 325 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న కాలేజీలలో కొత్త బస్టాండ్ వద్ద గల అల్ఫోర్స్, పాత బస్టాండ్ వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నారాయణ, తహశీల్దార్ రామ్ మోహన్ లు ఉన్నారు.

# బదిలీపై వెళ్లిన అధికారికి సన్మానం



రాయికల్ ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):

రాయికల్ పట్టణంలో గత కొన్ని రోజులుగా క్రితం రాయికల్ మండల అభివృద్ధి అధికారి గా మరియు పురపాలక సంఘం కమిషనర్ గా విధులు నిర్వహించిన గంగుల సంతోష్ కుమార్ బదిలీపై భీంగల్ మండల అభివృద్ధి అధికారిగా వెళ్లగా ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు అందులో భాగంగా పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లీ పూర్ మాజీ సర్పంచ్ అత్తి నేని గంగారెడ్డి, రాయికల్ మాజీ ఉప సర్పంచ్ బాపురపు నర్సయ్య, వార్డు సభ్యులు పోన్నం శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పుష్ప-2 కోసం భారీగా ఖర్చు



ప్రస్తుతం ఇండియాలో మోస్ట్ అవైటెడ్ మూవీ ఏదైనా ఉందా? అంటే అది పుష్ప-2 అనే చెప్పాలి. లెక్కల మాస్టార్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో 2022 డిసెంబర్లో వచ్చిన పుష్ప సినిమా పాన్ ఇండియా రేంజ్లో బ్లాక్బస్టర్గా నిలిచింది. తగ్గేదేలే.. అంటూ బన్నీ చెప్పిన డైలాగ్ దేశవ్యాప్తంగా సినీ అభిమానులకు తెగ నచ్చేసింది. ఈ సినిమా సెకండ్ పార్ట్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని సినీ అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా షూటింగ్కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ మూవీలో ఇంటర్వెల్ సీన్ గంగమ్మ జాతర బ్యాక్డ్రాప్లో తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఇంటర్వెల్ సీన్ కోసమే మేకర్స్ రూ.50 కోట్లు ఖర్చుపెట్టినట్లు టాక్ వినిపిస్తోంది. గంగమ్మ జాతర సీక్వెన్స్ దాదాపు 25 నిమిషాలు ఉండనున్నట్లు తెలుస్తోంది. దీంతో మూవీ ఎంత గ్రాండ్గా ఉంటుందోనని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చిత్తూరు, తిరుపతిలోని ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుండగా.. తిరుపతిలోని స్థానిక గంగమ్మ జాతరలోని సంప్రదాయాన్ని సుక్కు ఈ సినిమాలో చూపించనున్నాడు.

prajamantalau daily pages (29-02-24)_times of varha main (13-2).qxd 2/29/2024 4:09 AM Page 6



# గవర్నర్ చే గోల్డ్ మెడల్ అందుకున్న చిలుక సాత్విక్

మల్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రానికి చెందిన చిలుక సాత్విక్‌బుధవారం రాష్ట్ర గవర్నర్, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఛాన్సర్ తమిళ సై సౌందర రాజన్ ద్వారా గోల్డ్ మెడల్ అందుకున్నారు, ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజనీర్ ఐన చిలుక సాత్విక్ హైదరాబాద్ లో రవీంద్ర భారతి లో నిర్వహించిన పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ 16వ స్నాతకోత్సవ%శీ% సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ చదివిన సాత్విక్ వాస్తు శాస్త్రం ఆర్కిటెక్చర్ పీజీ లో యూనివర్సిటీ గోల్డ్ మెడల్ కు ఎంపికయ్యారు, ఈ మేరకు సాత్విక్ కు యూనివర్సిటీ ఛాన్సర్ రాష్ట్ర గవర్నర్ అయిన తమిళసై సౌందర రాజన్ తో పాటు వైస్ ఛాన్సర్ తంగెడ కిషన్ రావు ,చేతుల మీదుగా స్వర్ణ పథకం తో పాటు ప్రశంస పత్రం , పీజీ పట్టాను అందుకున్నారు, ఇదిలా ఉండగా, చిలుక సాత్విక్ గత 2022లో కూడా కూకట్ పల్లి జేఎన్టీయూలో జరిగిన కార్యక్రమంలో 10 వ స్నాత కొత్సవం లో సివిల్ ఇంజనీరింగ్ లో జేఎన్టీయూ యూనివర్సిటీ గోల్డ్ మెడల్ ను కూడా రాష్ట్ర గవర్నర్ తమిళ్ ద్వారా అందుకోవడం విశేషం,! రెండేళ్లలో రెండుసార్లు గవర్నర్ చేత గోల్డ్ మెడల్ పొందడంతో పాటు ఇటీవల ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ వారు నిర్వహించిన ఇంజనీరింగ్ అవార్డ్స్ కార్యక్రమంలో సాత్విక్ ఉత్తమ ఇంజనీర్ 2023 కు అవార్డు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## మార్చి 1న వస్తోన్న చారి 111




'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ కథానాయికగా, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితీ సోనీ నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న విడుదలవుతోంది. అదితీ సోనీ మాట్లాడుతూ? నిర్మాతగా 'చారి 111' నా తొలి సినిమా. వైవిధ్యమైన కథతో తీసిన మంచి వినోదాత్మక చిత్రమిది. వెన్నెల కిశోర్ కామెడీని ప్రతి ఒక్కరు ఎంజాయ్ చేస్తారు' అన్నారు. మళ్ళీ మొదలైంది' సినిమా తర్వాత నేను చేసిన ద్వితీయ చిత్రం 'చారి 111'. ఇదొక స్పై యాక్షన్ కామెడీ జానర్ ఫిల్మ్ అన్నారు టీజీ కీర్తికుమార్. ఈ సినిమాలో ఒక్కటే పాట ఉంది. ఈ పాటని అద్భుతంగా రాయడానికి మూడు నెలల సమయం తీసుకున్నానని అన్నారు రామజోగయ్య శాస్త్రి. తెలుగులో నాకు తొలి చాన్స్ ఇచ్చిన యూనిట్‌కి థ్యాంక్స్ అన్నారు సంయుక్తా విశ్వనాథన్. ఈ సినిమాకు మ్యూజిక్ అందించడం హ్యాపీగా ఉందని అన్నారు సైమన్ కె. కింగ్.

## హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలి కాంబినేషన్

### నేడు టైటిల్ ప్రకటించనున్న మూవీ టీమ్




హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలి కాంబినేషన్‌లో వచ్చిన 'రాజ రాజ చోర' చిత్రం నవ్వుల వర్షం కురిపించి.. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఈ కాంబినేషన్ మరోసారి రిపీట్ కాబోతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ప్రముఖ నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ నిర్మించబోయే కొత్త చిత్రం కోసం వీరు మళ్లీ కలిశారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ చిత్రాన్ని ప్రొడక్షన్ నెం 32గా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అఫీషియల్‌గా అనౌన్స్ చేస్తూ.. తాజాగా ఓ పోస్టర్ వదిలారు. ఈ అనౌన్స్‌మెంట్ పోస్టర్ చాలా ఫన్ జనరేట్ చేస్తోంది. ఈ సినిమా టైటిల్‌ని గురువారం శ్రీవిష్ణు పుట్టినరోజు సందర్భంగా ప్రకటించ నున్నారు. దానికి నామకరణం ఈవెంట్ అని పేరు పెట్టారు. ఇది అచ్చతెలుగు సినిమా అని చెప్పడమే దీని ఉద్దేశం. పోస్టర్ సూచించినట్లుగా ఈ కొత్త చిత్రం బిగ్గర్ ఎంటర్‌టైనర్‌గా ఉ ండబోతోందని మేకర్స్ చెబుతున్నారు. సూపర్ హిట్ 'రాజ రాజ చోర'తో ఆకట్టుకున్న హసిత్ గోలి.. శ్రీవిష్ణును హిలేరియస్ పాత్రలో ప్రజెంట్ చేయడానికి మరొక వినోదాత్మక, విన్నింగ్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. మరోవైపు, శ్రీవిష్ణు తన గత చిత్రం 'సామజవరగమన' బ్లాక్‌బస్టర్ సక్సెస్‌తో టాప్ ఫామ్‌లో వున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే ఈ చిత్రం.. మరోసారి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తుందని నిర్మాణ సంస్థ భావిస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను గురువారం వెల్లడించనున్నారు.

# విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ లో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్








హుజూరాబాద్ ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):

హుజూరాబాద్ పట్టణంలోని విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ పాఠశాలలో బుధవారం రోజున జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నీ నిర్వహించామని పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల చార్ట్స్, మోడల్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి వెంకట నరసింహారెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని, సైన్స్ మన జీవితంలో ఒక భాగం అని, సైన్స్ లేకుండా మనం జీవించ లేమని, విద్యార్థులందరూ భవిష్యత్తులో మంచి స్థానంలో ఉండాలని తెలిపారు. ట్రస్మా స్టేట్ చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోవద్దని, సైన్స్ మనకు దిశా నిర్దేశం చేస్తుందని, ప్రతిదానిలో సైన్స్ ఇమిడి ఉందని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు మంచి విషయాలు నేర్పాలనీ తెలిపారు. అలాగే ట్రస్మ జిల్లా ప్రెసిడెంట్ కోరం సంజీవరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా విధానం పూర్తిగా మారిందని, ముందున్నట్లుగా కాకుండా విద్యార్థులు ఎప్పటికప్పుడు సంబంధిత సబ్జెక్ట్ లలో పూర్తి పట్టు సాధించాలని, పాఠశాల టీచర్లు బోధించేటప్పుడు, విద్యార్థులు పూర్తి అవగాహన పొందాలని తెలిపారు. తదనంతరం విజ్ఞాన్ పాఠశాల లీడ్ కరికులం ఇంప్లిమెంటేషన్ లో భాగంగా ఇచ్చే 'శిక్ష' అవార్డులలో స్టేట్ సెకండ్ టాపర్ గా నిలిచినందుకు, అప్రిసియేషన్ సర్టిఫికెట్స్ ని పాఠశాలకు, అలాగే బెస్ట్ టీచర్స్ గా నిలిచిన టీచర్లకు అందించారు. అలాగే స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ లో మంచి ప్రాజెక్ట్స్ చేసిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందించడంతోపాటు, పాఠశాల సైన్స్ ఉ పాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట నరసింహారెడ్డి, ట్రస్మ స్టేట్ చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావు, ట్రస్మా డిస్టిక్ ప్రెసిడెంట్ కోరెం సంజీవరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్, డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, సి ఆర్ పి రంగు దామోదర చారి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవుడి పేరు చెప్పి ఓట్లు అడిగే సంస్కృతి బిజెపి ది

### రామ మందిరం నిర్మిస్తే రామరాజ్యం వచ్చినట్టా!?

### ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని విమర్శించే నైతిక హక్కు బోగ శ్రావణికి లేదు

### టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు బండ శంకర్

జగిత్యాల ఫిబ్రవరి 28 (ప్రజామంటలు):




దేవుడిపేరు చెప్పి ఓట్లు అడిగే నీచ సంస్కృతి బీజేపీ దని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు బండ శంకర్ ఆరోపించారు. బుధవారం జగిత్యాల ఇందిరభవన్ లో కాంగ్రెస్ నాయకులతో కలిసి బండ శంకర్ విలేకరులతో మాట్లాడుతూ.... రామ మందిరం నిర్మిస్తే రామరాజ్యం వచ్చినట్టేనా , రామరాజ్యం దేశంలో ఉందా అని ప్రశ్నించారు. స్వాతంత్ర్య సంగ్రామ0లో ఆర్ ఎస్ ఎస్ పాత్ర గొప్పదని చెప్పుకుంటున్న బీజేపీ నాయకులు అసలు చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని మాజీ మున్సిపల్ చైర్పర్సన్, బీజేపీ నాయకురాలు భోగ శ్రావణికి బండ శంకర్ హితవు పలికారు. స్వాతంత్ర్య సంగ్రామనికి ఆర్ ఎస్ ఎస్ కు ఎలాంటి సంబంధంలేదని స్పష్టం చేశారు. ఇతర పార్టీలనుండి గెలిచిన ప్రజాప్రతినిధులను ప్రలోభపెట్టి బీజేపీ లో చేర్చుకుంటున్న నీచ చరిత్ర బీజేపీదని విమర్శించారు. జగిత్యాల పట్టణాభివృద్ధి కి పాటుపడుతానని నిన్ను చైర్మన్ గా గెలిపించిన ప్రజల ఆశలను వమ్ముచేసి ఎమ్మెల్యే పదవీకాంక్షతో మూడేళ్లకే రాజీనామా చేసి బీఆర్ఎస్ ను విడి బీజేపీలో చేరిన నువ్వు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని విమర్శిస్తావా అని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజలకోసం పరితపించే నాయకుడు జీవన్ రెడ్డి అని చెబుతూ ఆయనను విమర్శించే నైతిక హక్కు శ్రావణికి లేదన్నారు. జగిత్యాల పట్టణ ప్రజలు నమ్మి "మహానటి" బిరుదు ఇచ్చారని చెబుతూ శ్రావణి సినిమాల్లోకి వెళ్లి ఉంటే ఎన్నో అవార్డులు వచ్చేవని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రజాల్లోనే ఉంటూ సమస్యలు పరిష్కరిస్తారని కానీ శ్రావణి సమస్యలను సృష్టిస్తారని, జీవన్ రెడ్డి జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ మహిళలు ఉరుకోరని అనిత హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గుంటి జగదీశ్వర్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, నేహల్, మున్నా, చిట్ల లత తదితరులు పాల్గొన్నారు.

# ఖడ్గమృగం తెచ్చి...నన్ను సొంతం చేసుకోండి

## నటి అనుపమ పరమేవ్వరన్ ఆఫర్

మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ బంపరాఫర్ ఇచ్చింది. తనకు ఒక ఖడ్గమృగాన్ని తెచ్చి బహుమతిగా ఇస్తే మీ సొంతం అయిపోతానని చెప్పేసింది. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎందుకంటే అనుపమ లాంటి అమ్మాయి ఆఫర్ ఇస్తే ఎవరు కాదంటారు చెప్పండి. కచ్చితంగా ఆ గిఫ్ట్ కొనిచ్చేస్తారుగా. ఇంతకీ అనుపమ ఏం చెప్పింది? అసలేం జరిగింది? మలయాళ 'ప్రేమమ్'తో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించిన అనుపమ.. 'అఆ' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'శతమానం భవతి', 'హలో గురు ప్రేమ కోసమే', 'కార్తికేయ 2' తదితర చిత్రాలు చేసింది. రీసెంట్‌గా రవితేజ 'ఈగల్'లో కీలక పాత్రలో కనిపించింది. ఈమె సూపర్ హాట్‌గా నటించిన 'టిల్లూ స్క్వేర్' త్వరలో థియేటర్లలోకి రానుంది. సినిమాల సంగతి పక్కనబెడితే సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉంటే అనుపమ.. అభిమానులతో టచ్‌లో ఉంటుంది. తాజాగా ఓ ఖడ్గమృగం పిల్లకి సంబంధించిన ఓ వీడియోని పోస్ట్ చేసి, దీన్ని ఎవరైనా తనకు బహుమతిగా ఇస్తే తను వాళ్ల సొంతమైపోతానని చెప్పింది. అంటే డేటింగ్ లేదా పెళ్లి చేసుకుంటానని ఫన్నీగా చెప్పింది. ఇప్పుడీ క్యాప్షన్‌పై ఫన్నీ కామెంట్స్ వస్తున్నాయి.



# గేమ్‌ఛేంజర్ విడుదలలో మరింత ఆలస్యం




ట్రిపుల్ ఆర్ సినిమాతో ఇంటర్నేషనల్ వైడ్‌గా క్రేజ్ తెచ్చుకున్న హీరో రామ్ చరణ్ తన తరువాతి సినిమాని సెన్సేషనల్ డైరక్టర్ శంకర్ గేమ్ ఛేంజర్‌తో వస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమలో రామ్ చరణ్ డ్యూయల్ రోల్ నటిస్తున్నారు. చాలా కాలంగా షూటింగ్ జరపుకుంటున్న ఈ సినిమా ఒకనొక టైంలో 2024 సంక్రాంతికి రిలీజ్ చేస్తారని ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూశారు. అంతేకాదు ఈ సినిమా గురించి అప్డేట్స్ ఇవ్వకుంటే..ఆత్మహత్య చేసుకుంటా అంటూ బెదిరింపు లేఖలు కూడా దర్శనం ఇచ్చాయి. అయితే డైరక్టర్ శంకర్‌కు ఉన్న డిమాండ్స్ మేరకు షూటింగ్ ఇబ్బందులు, ఇంకా కొన్నిటెక్నీకల్ కారణాల వల్ల సంక్రాంతికి రిలీజ్ కాకపోడంతో పాటు ఎలాంటి అప్డేట్ కూడా ఇవ్వలేదు. దీంతో గేమ్ ఛేంజర్ రిలీజ్ ఎప్పుడనే విషయాన్ని మూవి టీమ్ సస్పెన్స్‌లో ఉంచుతూ.. షూటింగ్ మీద పోకస్ చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 80 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా రాబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. త్వరలో మేకర్స్ అఫిసియల్ డేట్ అనౌన్స్ చేసే అవకాశం ఉంది. అయితే,అక్టోబర్‌లో దసరా కనుకగా రిలీజ్ చేస్తారని చరణ్ ఫ్యాన్స్ అశపడ్డారు. కానీ, ఇప్పుడు అది కూడా కష్టంగా మారిందని తెలుస్తుంది. ఎందుకంటే దసరాకి ఎన్టీఆర్ నటిస్తున్న దేవర సినిమా వస్తుండటంతో గేమ్ చేంజర్ మూవీని క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేయాలనీ డిసైడ్ అయినట్లు సమాచారం. డైరెక్టర్ శంకర్..కమల్ హాసన్ ఇండియాన్ 2 కూడా తెరకెక్కిస్తుండటంతో..గేమ్ చేంజర్ లేట్ కు అసలైన కారణం అని తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ వరల్డ్ వైడ్ గా ఫేమస్ అయిన చరణ్..తనదైన కోణంలో సినిమాలు తీసే శంకర్ కలిసొచ్చే ఈ సినిమా ఇండస్ట్రీ ఆల్ టైం హిట్ గా చూడాలనేది ఫ్యాన్స్ కోరిక. ఈ సినిమాను స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తుండగా..బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ మూవీలో అంజలి, శ్రీకాంత్, సునీల్, నవీన్ చంద్ర తదితరులు నటిస్తున్నారు.యస్ యస్ థమన్ సంగీతం అందిస్తున్నారు.

prajamantalau daily pages (29-02-24)_times of varha main (13-2).qxd 2/29/2024 4:09 AM Page 7



## పోచర్ వెబ్‌సిరీస్ చూసి మహేశ్ బాబు ఎమోషనల్



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ నిర్మాతగా మారి తెరకెక్కించిన తాజా వెబ్ సిరీస్ 'పోచర్'. ఈ సిరీస్‌ను ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోతో కలిసి అలియా భట్ నిర్మించింది. ప్రస్తుతం ఈ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వెబ్ సిరీస్ చూసిన సూపర్ స్టార్ మహేష్ బాబు 'పోచర్'పై ప్రశంసల వర్షం కురిపించాడు. ఎవరైనా ఏనుగులను అలా ఎలా చంపగలరు. వారికి మానవత్వం లేదా? అలా చేస్తున్నప్పుడు వారి చేతులు వణకడం లేదా? ఈ క్రైమ్-థ్రిల్లర్ చూస్తున్నప్పుడు నా మైండ్ లో ఇవే ప్రశ్నలు తిరుగుతూ ఉన్నాయి. ఈ జెంటిల్ జెయింట్స్ ని కాపాడుకునేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు పోరాడాలి అంటూ మహేష్ రాసుకొచ్చాడు. కాగా ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మలయాళ నటులు నిమిషా సజయన్, రోషన్ మథ్యూ, దివ్యేంద్ర భట్టాచార్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్‌కు ఎమ్మీ అవార్డు విన్నర్ రిచీ మెహతా దర్శకత్వం వహించాడు. అమెజాన్ ప్రైమ్ లో హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ సిరీస్ కథ విషయానికి వస్తే.. ఏనుగు దంతాల స్మగ్లింగ్‌తో పాటు, అడవుల్లో వన్య ప్రాణులపై దాడుల చేసే వారిపై ఈ సిరీస్ వచ్చింది. ఇక వారిని పట్టుకునేందుకు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులు, ఔఉక్ష కార్మికులు, లోకల్ పోలీసులు ఎం చేశారు అనేది ఈ సిరీస్ కథ.

## సెంట్రల్ కాంట్రాక్టుల నుంచి ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్ ఔట్



అనుకున్నట్టుగానే జరిగింది. ఆ ఇద్దరు స్టార్ బ్యాటర్లకు షాకిచ్చింది బీసీసీఐ. రంజీల్లో ఆడమని సూచించినా వినకపోవడంతో.. 2023-24 ఏడాదికి గానూ టీమిండియా సెంట్రల్ కాంట్రాక్టుల లిస్టు నుంచి ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌ను తొలగించింది. బీసీసీఐ ప్రకటించిన కాంట్రాక్టుల లిస్టులో గ్రేడ్‌లో నలుగురు ఆటగాళ్లు ఉండగా, గ్రేడ్‌లో ఆరుగురు ప్లేయర్స్.. గ్రేడ్‌లో ఐదుగురు, గ్రేడ్‌లో పదిహేను మంది క్రికెటర్లు ఉన్నారు. టీ20ల్లో దుమ్మురేపిన రింకూ సింగ్, తిలక్ వర్మలను సీ గ్రేడ్‌లో చేర్చింది బోర్డు. ఇక, గ్రేడ్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీతో పాటు జసప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా ఉన్నారు. వీరికి ప్రతీ ఏడాది రూ.7 కోట్లు చెల్లిస్తుంది బీసీసీఐ. వీటితో పాటు మ్యాచ్ ఫీజులు, బోనస్‌లు, ప్రైజ్?మనీలు అదనంగా ఉంటాయి. అలాగే ప్లేయర్లకు సంబంధించి ట్రైనింగ్ ఫెసిలిటీస్, మెడికల్ సపోర్ట్, ట్రావెల్ అలవెన్స్‌లను బోర్డు భరిస్తుంది. గ్రేడ్?-ఏలో అశ్విన్, షమీ, సిరాజ్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా ఉండగా.. వీరికి బోర్డు సంవత్సరానికి రూ.5 కోట్లు చెల్లిస్తుంది. ఇక గ్రేడ్ బీలో ఉన్న సూర్యకుమార్ యాదవ్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, యశస్వి జైస్వాల్‌కు ఏడాదికి రూ.3 కోట్లు అందనున్నాయి. గ్రేడ్ సీలో ఉన్న రింకూ సింగ్, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, శార్దూల్ ఠాకూర్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, జితేష్ శర్మ, వాషింగ్టన్ సుందర్, ముకేష్ కుమార్, సంజూ శాంసన్, అర్ష్‌దీప్ సింగ్, కేఎస్ భరత్, ప్రసిద్ధ్ కృష్ణ, అవేశ్ ఖాన్, రజత్ పటిదార్‌కు రూ.1 కోటి చొప్పున బీసీసీఐ చెల్లించనుంది.

## క్రికెటర్‌కు అభిమాని పెళ్లి ప్రపోజల్..

తమకు ఇష్టమైన ఆటగాళ్ల కోసం అభిమానులు ఏది చేయడానికైనా సిద్ధం అనే విధంగా ఉంటారు. క్రికెట్ మ్యాచ్ లు ఎక్కడ జరుగుతున్నా సరే.. అక్కడికి వెళ్లి సపోర్ట్ చేస్తుంటారు. ముఖ్యంగా.. భారతీయులు ఏ కంట్రీలో మ్యాచ్ జరిగినా వెళ్తుంటారు. ఇదిలా ఉంటే.. మ్యాచ్ మధ్యలో కొందరు అభిమానులు తమకు ఇష్టమైన ఆటగాళ్ల పేర్లను ప్లకార్డులపై రాసి చూపిస్తారు. వారి మనసులో ఏదనుకుంటారో దానిని ప్లకార్డుపై వ్యక్తపరుస్తారు. నాకు ఈ ఆటగాడు అంటే ఇష్టం, ఇతని బ్యాటింగ్ అంటే ఇష్టం, బౌలింగ్ అంటే ఇష్టం, లవ్ అండ్ మ్యారేజ్ ప్రపోజల్స్.. ఇలా తమకు నచ్చిన విధంగా ప్లకార్డులపై రాస్తారు. అయితే కొన్నిసార్లు వాళ్ల వీడియో టీవీలో వచ్చినప్పుడు సంతోష పడుతారు. అసలు విషయానికొస్తే, మహిళా ప్రీమియర్ లీగ్ మ్యాచ్ జరుగుతున్న క్రమంలో.. ఓ లేడీ క్రికెటర్ కు వీరాభిమాని పెళ్లి ప్రపోజల్ పెట్టాడు. అందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంతకీ ఆ లేడీ క్రికెటర్ ఎవరునుకుంటున్నారా.. ఆర్సీబీకి చెందిన ప్లేయర్ శ్రేయాంక పాటిల్. మంగళవారం(ఫిబ్రవరి 27)న గుజరాత్ జెయింట్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లో ఓ ఇంట్రెస్టింగ్ సన్నివేశం కనిపించింది. ప్రేక్షకుల గ్యాలరీలో ఉన్న ఓ అభిమాని.. పెళ్లి ప్రపోజల్ చేశాడు. 'విల్ యూ మ్యారీ మీ శ్రేయాంక పాటిల్' అని ప్లకార్డుపై రాశాడు. అందులో రెడ్ హార్ట్ సింబల్ కూడా ఉంది. ఈ సీన్ బిగ్ స్క్రీన్ పై కనిపించగానే డగౌట్ లో కూర్చున్న ఆర్సీబీ ప్లేయర్లు నవ్వులు చిందించారు. శ్రేయాంక కూడా చిన్న స్మైల్ తో తన రిప్లైని ఇచ్చింది. ఈ ప్లకార్డులో అతని పేరు కన్నడలో ఉంది. దీన్ని బట్టి ప్రపోజ్ చేసిన యువకుడు స్థానికుడే అని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. అయితే.. లేడీ ఫ్యాన్స్ పురుష క్రికెటర్లకు లవ్, మ్యారేజ్ ప్రపోజల్స్ చేయడం ఎక్కువగా చూస్తుంటాం. కానీ చాలా తక్కువ సందర్భాల్లో లేడీ క్రికెటర్లకు ఇలాంటి ప్రపోజల్స్ చూస్తుంటాం.

# ఈసారి ఆర్‌సీబీ ఐపీఎల్ టైటిల్ గెలవాలని కోరుకుంటున్నా




కలర్‌ఫుల్ క్రికెట్ టోర్నమెంట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రారంభానికి కౌంట్‌డౌన్ మొదలైంది. మార్చి 22న ప్రారంభ మయ్యే ఐపీఎల్ సీజన్-17 తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్లు తలపడనున్నాయి. తాజాగా ఈ ధనా ధన్ లీగ్‌పై మిస్టర్ ఐపీఎల్ సురేశ్ రైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ షెడ్యూల్ ప్రకటించిన మాట్లాడిన రైనా ఈసారి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఈసారి కప్ గెలుస్తుందని ఎదురు చూస్తున్నానన్నాడు. 'విరాట్ కోహ్లీ ఆర్‌సీబీ ట్రోఫీ గెలవాలని కోరుకుంటున్నాను. ఈ వెయిటింగ్ టైమ్ అయిపోయిందని చెప్పొచ్చు. గత సీజన్‌లో విజయం సాధించింది. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు కప్ గెలవని జట్టు చాంపియన్‌గా నిలవాలని కోరుకుంటున్నా' అని సురేశ్ రైనా చెప్పుకొచ్చాడు. గత 16 సీజన్లలో విరాట్ కోహ్లీ చాలా కష్టపడ్డాడని, కాబట్టి ఈసారి ఆర్‌సిబి జట్టు కప్ గెలిచేందుకు అర్హత ఉందని భావిస్తున్నట్లు రైనా తెలిపాడు. మరి రైనా కోరుకున్నట్లు బెంగళూరు ఈసారైనా ఐపీఎల్ కప్ కొడుతుందా? లేదా? అన్నది మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది. ఐపీఎల్‌లో ట్రోఫీ గెలవాలన్న ఆర్సీబీ కల కొనసాగుతోంది. గత 16 ఏళ్లలో 3 సార్లు ఫైనల్లోకి అడుగుపెట్టిన ఆర్సీబీ.. చివరి దశలో తడబడుతోంది. 2009లో అనిల్ కుంబ్లే నాయకత్వంలో ఆర్‌సిబి జట్టు తొలిసారి ఫైనల్‌లోకి ప్రవేశించింది. కానీ ఫైనల్ మ్యాచ్‌లో డెక్కన్ ఛార్జర్స్‌పై 6 పరుగుల తేడాతో ఓడి ట్రోఫీని ముద్దాడే అవకాశాన్ని కోల్పోయింది. దీని తర్వాత 2011లో డేనియల్ వెట్టోరి నేతృత్వంలో ఫైనల్ ఆడింది. ఆ రోజు, పై 58 పరుగుల తేడాతో ఓడిపోయిన తొలిసారి ఛాంపియన్‌గా నిలిచే అవకాశాన్ని కోల్పోయింది. 2016లో విరాట్ కోహ్లి నేతృత్వంలో ఆర్‌సీబీ ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కేవలం 8 పరుగుల తేడాతో ఓడి తొలిసారి ట్రోఫీని గెలుచుకునే అవకాశాన్ని కోల్పోయింది. ఇప్పుడు 17వ సీజన్‌ను ప్రారంభించడానికి సిద్ధంగా ఉంది. కనీసం ఈసారి అయినా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కప్ గెలవడం ద్వారా 16 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు:**

ఫాఫ్ డుప్లెసిస్ (కెప్టెన్), గ్లెన్ మాక్స్‌వెల్, విరాట్ కోహ్లి, రజత్ పాటిదార్, అనుజ్ రావత్, దినేష్ కార్తీక్, సుయాష్ ప్రభుదేశాయ్, విల్ జాక్స్, మహిపాల్ లోమ్రోర్, కర్ణ్ శర్మ, మనోజ్ భాండాగే, మయాంక్ దాగర్, విజయ్‌కుమార్ వైషాక్, ఆకాశ్ దీప్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ సిరాజ్, టాప్లీ, హిమాన్షు శర్మ, రాజన్ కుమార్, కామెరాన్ గ్రీన్, అల్జారీ జోసెఫ్, యశ్ దయాల్, టామ్ కరణ్, ఫెర్గూసన్, స్వప్నిల్ సింగ్, సౌరవ్ చౌహాన్.

# పాయింట్ల పట్టికలో ఆర్సీబీ అగ్రస్థానం



ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్‌లో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో కేవలం రెండింట్లో మాత్రమే గెలిచి పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. అయితే ఇప్పుడు రెండో సీజన్ లో మాత్రం స్మృతి మంధన్నా టీమ్ దూకుడు మంత్రం జపిస్తోంది. ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ ఘన విజయాలు సాధించింది. లీగ్ లో యూపీ వారియర్స్ తో తొలి మ్యాచ్ ఆడిన ఆర్సీబీ జట్టు 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆ తర్వాత రెండో మ్యాచ్‌లో గుజరాత్‌ను ఓడించి లీగ్‌లో అజేయంగా కొనసాగింది. లీగ్‌లోని ఐదో మ్యాచ్‌లో ఆర్‌సీబీ 8 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. గుజరాత్ నిర్దేశించిన 108 పరుగుల విజయ లక్ష్యాన్ని ఆర్సీబీ 45 బంతులు మిగిలి ఉండగానే 2 వికెట్లు కోల్పోయి సాధించింది. ఆర్‌సీబీ కెప్టెన్ స్మృతి మంధాన 43 పరుగులతో ఇన్నింగ్స్ ఆడగా, బౌలింగ్‌లో రేణుకా ఠాకూర్ 2, సోఫీ మోలినెక్స్ 3 వికెట్లు తీశారు. ఈ మ్యాచ్‌లో విజయంతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో ముంబై ఇండియన్స్‌ను అధిగమించింది. ఇప్పుడు టేబుల్ టాపర్‌గా నిలిచింది. జట్టు నెట్ రన్ రేట్ 1.665 కాగా మొత్తం 4 పాయింట్లు ఖాతాలో ఉన్నాయి. అదే సమయంలో, డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ కూడా ఆడిన రెండు మ్యాచ్‌లను గెలుచుకుంది. పాయింట్ల పట్టికలో 4 పాయింట్లతో రెండవ స్థానంలో ఉంది. ముంబై జట్టు నెట్ రన్ రేట్ 0.488. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండు మ్యాచ్‌లు ఆడింది, ఒకటి గెలిచింది, ఒకటి ఓడి 2 పాయింట్లు సాధించింది, ఆ జట్టు 1.222 నెట్ రన్ రేట్‌తో మూడో స్థానంలో ఉంది. మిగతా చోట్ల గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్ తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయాయి. ఈ రెండు జట్లూ ఇంకా ఖాతా తెరవకపోడంతో చివరి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. మరి రాబోయే మ్యాచుల్లోనూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇదే జోరు కొనసాగిస్తుందో?లేదో? చూడాలి.

## ఐదో టెస్టుకు కూడా కేఎల్ రాహుల్ దూరం!

ఇంగ్లండ్‌తో జరిగే ఐదవ టెస్టుకు కూడా టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ దూరం కానున్నట్లు తెలుస్తోంది. రాహుల్ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడమే ఇందుకు కారణం. రాహుల్ సమస్య ఏమిటో బీసీసీఐ వైద్య బృందానికి అంతుచిక్కపోవడంతో అతడిని లండన్‌కు పంపింది. అక్కడి వైద్య నిపుణుల వద్ద రాహుల్ చికిత్స పొందనున్నట్లు తెలుస్తోంది. రాహుల్ గాయంపై మార్చి 2 నాటికి బీసీసీఐకి ఓ క్లారిటీ రానుందని ఓ జాతీయ మీడియా తమ కథనంలో పేర్కొంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టు సిరీస్‌లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన టెస్టులో కేఎల్ రాహుల్ గాయపడ్డాడు. తొడకండరాలు పట్టేడయడంతో రెండు, మూడు, నాలుగో టెస్టుకు దూరమయ్యాడు. ఇన్ని రోజులు బీసీసీఐ వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స పొందాడు. ధర్మశాల వేదికగా జరుగనున్న ఐదవ మ్యాచ్‌లోనైనా రాహుల్ మైదానంలో దిగుతాడని భావించగా.. గాయం మళ్లీ తిరగబెట్టినట్లు తెలుస్తోంది. రాహుల్ సమస్య ఏమిటో బీసీసీఐ వైద్య బృందానికి అంతుపట్టకపోవడంతో అతడిని లండన్‌కు పంపారు. అక్కడ స్కానింగ్ తీయనుండగా.. మరో రెండు రోజుల్లో అసలు సమస్య ఏంటో తెలియరానుంది. 'గత మూడు టెస్టులకు లోకేష్ రాహుల్ అందుబాటులో ఉంటాడనే అనుకున్నాం. అయితే తాను తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు రాహుల్ చెప్పాడు. ఇటీవల వికెట్ కీపింగ్ కారణంగా అతడిపై పనిభారం ఎక్కువైంది. రాహుల్ తొడ కండరాల నొప్పితో బాధపడుతున్నాడు. అతడి తాజా మెడికల్ రిపోర్టును ఇంగ్లండ్‌లో గతంలో ట్రీట్‌మెంట్ ఇచ్చిన డాక్టర్‌కు పంపించారు. నేరుగా చెకప్ చేసిన తర్వాతే సమస్య ఏమిటో తెలుస్తుందని డాక్టర్ చెప్పారు' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఇప్పటికే 3-1తో గెలిచింది. మార్చి 7 నుంచి ధర్మశాల వేదికగా ఐదో టెస్టు ఆరంభం కానుంది.






PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com